
ISO 9001 COMPANY
Sterling
M :9100100959
:9573020870
SRI VENKATESHWARA PUMPS & MOTORS
Authorised Dealers for Sterling Addison
All Type Of Motors Repairing, Lifting & Fitting
SALES & SERVICES
Allwyn 'X' Road, Miyapur, Hyderabad - 500 049.

# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక

MAHESH KUMAR KOVURY CELL:9695824338
STOOP
TAILORS&TEXTILES
SUITING,SHIRTING&READYMADES
MEN'S WEAR&KID'S WEAR
18-3-4,
BESIDE OLD POLICE STATION,
CHATRINAKA

సంపుటి: 3 సంచిక: 225, పేజీలు - 09
సోమవారం, నవంబర్ 20, 2023 వెల: 5 రూ/.
Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati




# గ్రేటర్ ఓటర్ ఎటువైపు..?

## - త్రిముఖ పోరులో పాగావేసేదెవరో.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తుండటంతో అన్ని పార్టీలు ఓటర్లకు గాలం వేసే పనిలో పడ్డాయి. ముఖ్యంగా రాష్ట్ర రాజధాని గ్రేటర్ హైదరాబాద్‌లో తెలంగాణ ప్రాంతేతర ఓటర్లపై అధికార బీఆర్ఎస్‌తోపాటు, కాంగ్రెస్, బీజేపీ ఫోకస్ పెట్టింది. హోరాహోరీగా జరుగుతున్న ఎన్నికల్లో వారి ఓట్లు కీలకంగా మారడంతో, వారిని ప్రసన్నం చేసుకునే పనిలో మూడు పార్టీల నేతలు నిమగ్నమయ్యారు. ప్రాంతం, సామాజిక వర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి వారి మద్దతు కూడగట్టేందుకు బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కాంగ్రెస్ నేతలు కూడా 6లో ▶

## మోడీ వర్సెస్
# గెహ్లాట్ పోరు
## - ఎవరికి లాభం.?



**జైపూర్ (ప్రశ్న న్యూస్)** రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి గెలిచి అధికారం నిలబెట్టుకోవాలని భావిస్తున్న అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రధాని మోడీ రూపంలో గట్టి పోరు ఎదురవుతోంది. రాష్ట్రంలో ప్రతీ ఐదేళ్లకోసారి అధికార మార్పిడి చేసే సంప్రదాయం ఉండటంతో ఈ అవకాశాల్ని సద్వినియోగం చేసుకునేందుకు విపక్ష బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా సీఎం అభ్యర్థి ప్రకటించకుండానే బరిలోకి దిగి ప్రధాని మోడీనే ప్రధానంగా పరిగణిస్తోంది. రాజస్తాన్ అసెంబ్లీ పోరులో ఏడు గ్యారంటీలతో దిగిన కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా సంక్షేమాన్నే నమ్ముకుంది. అయితే వీటిని కౌంటర్ చేసేందుకు కేంద్రంలో తమ పాలనను బీజేపీ గుర్తు చేస్తోంది. ఇందులో భాగంగా అశోక్ గెహ్లాట్ వర్సెస్ ప్రధాని 6లో ▶

## ఒక్క ఛాన్స్ ఇవ్వండి,
# అభివృద్ధి అంటే చూపిస్తాం
### - ఖానాపూర్ కాంగ్రెస్ విజయభేరీ సభలో ప్రియాంక గాంధీ



**నిర్మల్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ అదికారంలోకి రాగానే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రియాంక గాంధీ హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ పాలనలో ప్రజల స్వప్నం నెరవేరలేదని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని ప్రియాంక గాంధీ అన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో జీవితాలు మారతాయని ఉద్యమకారులు కలలు కన్నారని, యువతకు కేసీఆర్ ఉద్యోగాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. కల్వకుంట్ల కుటుంబంలో మాత్రం 6లో ▶



## తెలంగాణ ఎన్నికల్లో ఈసీ కీలక నిర్ణయం
### - అదనంగా మరో 4368 ఈవీఎంలకు ఆర్డర్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు మరో 11 రోజులు మాత్రమే మిగిలి ఉంది. మరో 9 రోజుల్లో ప్రచారం కూడా పూర్తి కాబోతోంది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలన్నీ ప్రచారంలో మునిగి తేలుతున్నాయి. అదే సమయంలో ఈసీ కూడా ఎన్నికల పోలింగ్ కు శరవేగంగా ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. ఇందులో భాగంగా ఓ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో నామినేషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత ఈసీ తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకుంది. నవంబర్ 30న జరిగే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కోసం ఎన్నికల సంఘం తాజాగా మరో 4368 6లో ▶

## ప్రైవేటు స్కూళ్లకు
# జగన్ సర్కార్ వరాలు

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రైవేటు స్కూళ్లకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి కారణం ప్రభుత్వ పాఠశాలల్ని ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలే. ఇందులో అమ్మఒడి దగ్గరి నుంచి నాడు నేడు, విద్యాకానుక, విద్యాదీవెన, గోరుముద్ద వంటి పథకాల నుంచి ఇంగ్లీష్ మీడియం వంటి నిర్ణయాలు కూడా ఉన్నాయి. దీంతో ప్రైవేటు స్కూళ్లు ప్రభుత్వ పాఠశాలలతో పోటీ పడాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో నాలుగేళ్లుగా వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న 6లో ▶




## బీఆర్ఎస్ అంటే భ్రష్టాచార్ రాక్షసుల సమితి
### - జేపీ నడ్డా సంచలన వ్యాఖ్యలు

**చేవెళ్ల (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో కుటుంబ పాలనకు వ్యతిరేకంగా బీజేపీ పోరాడుతోందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వ్యాఖ్యానించారు. నారాయణపేట, చేవెళ్లలో సకల జనుల సంకల్ప సభల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ ఎన్నికలు బీజేపీకి, కుటుంబ పార్టీలకు జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులను కేసీఆర్ కుటుంబం దుర్వినియోగం చేసి, ప్రజలకు అందకుండా చేసిందని సంచలన ఆరోపణలు చేశారు. కేంద్రం పెట్రోల్, డీజిల్ పై వ్యాట్ తగ్గిస్తే సీఎం కేసీఆర్ ఆ ప్రయోజనం ప్రజలకు అందకుండా చేశారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు సీఎం కేసీఆర్ కు ఏటీఎంలా మారిందని, ఆ ప్రాజెక్టులోని ఓ బ్రిడ్జి ఇటీవలే కుంగిపోయిందని, బీజేపీ అధికారంలోకి రాగానే, కేసీఆర్ అవినీతిపై విచారణ జరిపి జైలుకు పంపిస్తామని అన్నారు. బీఆర్ఎస్ అంటే 'భ్రష్టాచార్ రాక్షసుల సమితి' అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. 6లో ▶



## ముక్కలైన కోట్ల
# హృదయాలు
### - ప్రపంచకప్ ఫైనల్లో టీమిండియా పరాభవం
### - ఆస్ట్రేలియాకు ఆరోసారి ప్రపంచకప్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సొంత గడ్డపై జరిగిన వన్డే ప్రపంచకప్ 2023లో టీమిండియా ఆఖరి మెట్టుపై బోల్తా పడింది. టోర్నీలో ఓటమి అన్నది ఎరగకుండా ఫైనల్ చేరిన టీమిండియా ట్రోఫీకి అడుగుదూరంలో నిలిచిపోయింది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారతజట్టు ఓటమి పాలైంది. తద్వారా టోర్నీలో మొదటి ఓటమి చవిచూసి టైటిల్‌కు దూరమైంది. టీమిండియా నిర్దేశించిన 6లో ▶

## ప్రజాస్వామ్యంలో
# ఫ్యాక్షనిస్టులు గెలవకూడదు
### - కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు

**గద్వాల్ (ప్రశ్న న్యూస్)** ప్రజల చేతిలో ఉన్న ఏకైక వజ్రాయుధం ఓటు అని ఎన్నికల సమయంలో విచక్షణతో ఆలోచించి ఓటెయ్యాలని సీఎం కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన పాల్గొన్నారు. ప్రజాస్వామ్యంలో ఫ్యాక్షనిస్టులు, గూండాలు గెలవకూడదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గతంలో పాలమూరు నుంచి అధికంగా వలసలు ఉండేవని, ప్రస్తుతం అక్కడ పరిస్థితులను ప్రజలు గుర్తించాలని చెప్పారు. పాలమూరులో కరువు రాకుండా చూసే బాధ్యత తనదని స్పష్టం చేశారు.



#### ఎస్టీ జాబితాలోకి వాల్మీకి, బోయలు

వాల్మీకి, బోయలను బీసీల్లో కలిపింది కాంగ్రెస్ పార్టీయేనని, మరోసారి అధికారంలోకి వస్తే వారిని ఎస్టీ జాబితాలో చేరుస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆర్డీఎస్ నుంచి నీళ్లు తరలించుకు పోతున్నా అప్పుడు కాంగ్రెస్ నేతలు పదవుల మీద ఆశతో ఎవరూ మాట్లాడలేదని, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా ప్రాజెక్టులను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ లో పెట్టిందని విమర్శించారు. 'ఆర్డీఎస్ కాలువల్లో పూడికతీత పనులకు రూ.13 కోట్లు మంజూరు చేశాం. కాంగ్రెస్ హయాంలో ఉండే పింఛన్ 6లో ▶

## కాంగ్రెస్ మేనిఫెస్టోతో
# బీఆర్ఎస్ భయపడుతోంది
### - బీజేపీకి 110 స్థానాల్లో డిపాజిట్ గల్లంతవుతుందన్న రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ మేనిఫెస్టో చూసి బీఆర్ఎస్ కు భయం పట్టుకుందని, అధికారం కోల్పోతున్నామనే సీఎం కేసీఆర్ ఆలోచన లేకుండా విచక్షణా రహితంగా మాట్లాడుతున్నారని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ జర్నలిస్టుల అధ్యయన వేదిక ఆధ్వర్యంలో 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 6 గ్యారెంటీలు సహా మేనిఫెస్టోలో పొందు పరిచిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో బీజేపీకి 105 స్థానాల్లో డిపాజిట్లు 6లో ▶

## మిస్ యూనివర్స్‌గా
# నికరాగ్వా అందగత్తె
### - ఎల్ సాల్వెడర్ వేదికగా 72వ మిస్ యూనివర్స్ పోటీలు
### - తొలిసారిగా వివాహితలు, అమ్మలకు అవకాశం
### - ఫస్ట్, సెకెండ్ రన్నరప్‌గా మిస్ థాయలాండ్, మిస్ ఆస్ట్రేలియా



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఈ ఏడాది విశ్వసుందరి కిరీటాన్ని నికరాగ్వా భామ గెలుపొందించింది. 72 మిస్ యూనివర్స్ పోటీల్లో మిస్ నికరాగ్వా షెన్నిస్ పలాసియోస్ విజేతగా నిలిచింది. గతేడాది విశ్వ సుందరి ఆర్ బానీ గాబ్రియేల్ ఆమెకు కిరీటాన్ని అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆఖరి రౌండ్‌లో.. జీవితంలో ఎవరిని మార్గదర్శిగా ఎంచుకుంటారని న్యాయ నిర్ణేతలు అడిగిన ప్రశ్నకు.. 18వ శతాబ్దపు బ్రిటిష్ తత్వవేత్త, స్త్రీవాది మేరీ వోల్‌స్టోన్‌క్రాఫ్ట్ అని 6లో ▶

# కల్వరి టెంపుల్ లో కేటీఆర్ తో కలిసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న అరెకపూడి గాంధీ

**- రాష్ట్రంలో మళ్లీ బిఆర్ఎస్ పార్టీదే అధికారమన్న కేటీఆర్**

**- ఎమ్మెల్యే గాంధిని భారీ మెజార్టీతో గెలిపించాలన్న కేటీఆర్**



**శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్)** రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని, మరోసారి కేటీఆర్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు జరగాలని ఆదివారం మియాపూర్ కల్వరి టెంపుల్ లో శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ, కూకట్పల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ రావు, తో కలిసి మంత్రి కేటీఆర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కల్వార్ టెంపుల్ అధినేత బ్రదర్ సతీష్ కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు. దేవుడు ఆశీర్వాదం ప్రజల సహకారంతో ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ గెలుస్తుందని అన్ని సంఘాలు, కులాలు, మతాలకు, అతీతంగా ప్రజలంతా బీఆర్ఎస్ వెంట ఉన్నారని అన్నారు. శేరిలింగంపల్లి అభ్యర్థి గాంధీని, కూకట్ పల్లి లో కృష్ణారావును, అత్యధిక మెజార్టీలతో గెలిపించాలని క్రైస్తవ సమాజాన్ని కేటీఆర్ కోరారు. ఈ కార్యక్రమంలో కల్వరి టెంపుల్ అధినేత సతీష్ కుమార్ క్రైస్తవ మత పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ బంద్



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** గౌడవెల్లి సబ్ స్టేషన్ నుండి విలువడే 33/11 కెవి విద్యుత్ సరఫరా విద్యుత్ తీగల క్రింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనిలో భాగంగా సోమవారం రోజు తేదీ 20.11.2023 నాడు ఉదయం 10.00 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు గౌడవెల్లి, బసరాగాడి, జ్ఞానాపూర్ , ప్రాంతాలలో,గృహలకు,వ్యవసాయ మోటర్ పంపులకు,పరిశ్రమలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతున్నట్లు వినియోగదారులకు జరుగుతున్న అసౌకర్యానికి చింతిస్తున్నట్లుగా మేడ్చల్ రూరల్ విభాగం విద్యుత్ ఏఈ తెలిపారు

## మేడ్చల్ లో శ్రీ మార్కండేయ పద్మశాలి ఆత్మీయ సమ్మేళనం



మేడ్చల్ (ప్రశ్న న్యూస్)మేడ్చల్ పట్టణంలోని సిక్ తోటలో ఆదివారం రోజు పద్మశాలి కులస్తులు అందరూ కలిసి ఆత్మీయ సమ్మేళనాన్ని మున్సిపల్ పరిధి అధ్యక్షుడు రుద్ర జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించుకున్నారు పద్మశాలి సంఘం తరపున మహిళలకు చీరలు పంపిణీ చేశారు తదనంతరం విందు కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో పద్మశాలి వర్గానికి సంబంధించిన వ్యక్తులు పాల్గొనడం జరిగింది

## పోచం రాల్ పోలీస్ చెక్ పోస్ట్ ను పరిశీలించిన జిల్లా వ్యయ పరిశీలకుడు సంజయ్ కుమార్



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్)** సాధారణ ఎన్నికల్లో భాగంగా హవేలీ ఘనపూర్ మండలం, పోచంరాల్ వద్ద గల పోలీస్ చెక్ పోస్ట్ ను, ఆదివారం జిల్లా వ్యయ పరిశీలకుడు సంజయ్ కుమార్ ఐఆర్ఎస్ పరిశీలించారు . సాయుధ దళాలకు , తనిఖీ బృందాలకు పలు సూచనలు చేశారు. చెక్ పోస్ట్ వద్ద గల సి సి కెమెరాలు , 24 గంటలు పనిచేయాలని , ప్రతి వాహనాన్ని ఖచ్చితంగా తనిఖీ చేయాలని ఆదేశించారు .అనంతరం హవేలీ ఘనపూర్ మండలంలోని ఔరంగాబాద్ తండా , కొచ్చెర్వు తండా , లింగాపూర్ తండా , పాటిగడ్డ తండా ల్లో జిల్లా వ్యయ పరిశీలకుడు సంజయ్ కుమార్ ఐఆర్ఎస్ పర్యటించారు . ఆయన గ్రామ ప్రజలతో మాట్లాడుతూ, ఓటుహక్కు వున్నా, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తమ ఓటును వినియోగించుకోవాలని అన్నారు. యువకులు నూతన ఉత్సాహంతో ఓటు వేయాలని అన్నారు . జిల్లాలో బి ఎల్ ఓ లు ఓటరు సమాచార స్లిప్పు పంపిణి చేస్తున్నారని, ఓటరు సమాచార స్లిప్ తో పాటు ఓటరు గైడ్ , సి - విజిల్ కరపత్రాన్ని అందిస్తున్నారని , ప్రజలందరూ ఎన్నికలనియమావళి తెలుసుకోవాలని అన్నారు . సి - విజిల్ ఆప్ , టోల్ ఫ్రీ నెంబర్ 1950 ముఖ్యఉద్దేశాన్ని ప్రజలకు వివరంచారు . ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేస్తే , సి -విజిల్ ఆప్ ద్వారా , పిర్యాదు చేయవచ్చుని , పిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు . ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ఎన్నికల సిబ్బంది

# శ్రీశైల దేవస్థానం లో మొదటి ఆదివారం కార్తీకమాసోత్సవాలు

**భక్తులకు సౌకర్యార్థం శ్రీస్వామివార్ల అలంకార దర్శనానికి మాత్రమే అవకాశం ఎటువంటి లోటు లేకుండా చేస్తున్న ఈఓ పెద్ది రాజు మరియు అధికారులు**

**లడ్డు ప్రసాదాలు మొత్తం 10 కౌంటర్ల ద్వారా ఈ లడ్డు ప్రసాదాలు విక్రయించబడుతున్నాయి.**



**శ్రీశైలం ( ప్రశ్న న్యూస్)** కార్తీకమాసంలో మొదటి ఆదివారమైన భక్తులు వేకువజాము నుండే ఆలయాన్ని సందర్శిస్తున్నారు. కార్తీకమాసంలో ప్రభుత్వసెలవుదినాలు, కార్తీక సోమవారాలు మరియు కార్తీకపౌర్ణమి రోజులలో భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రానికి చేరుకోవడం జరుగుతోంది. భక్తులందరు సంతృప్తికరంగా శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు వీలుగా దర్శన ఏర్పాట్లు చేయడం జరిగింది. వేకువజామున గం.3.00 లకు ఆలయద్వారాలు తెరచి, ప్రాతఃకాల పూజల అనంతరం వేకువజామున 4.30 నుంచి సాయంకాలం గం. 4.00ల వరకు దర్శనాలు కల్పించబడుతున్నాయి. అదేవిధంగా తిరిగి సాయంత్రం గం. 5.30ల నుంచి రాత్రి గం. 11.00ల వరకు దర్శనాలు కొనసాగుతాయి.రెండు విడతలుగా ఆర్జిత చండీ హెూమము మరియు రుద్రహెూమం జరిపించబడుతాయి.భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు వీలుగా కార్తీకమాసంలో శ్రీస్వామివారి గర్భాలయ ఆర్జిత అభిషేకాలు, సామూహిక ఆర్జిత అభిషేకాలు నిలుపుదల చేయబడ్డాయి. భక్తుల సౌకర్యార్థం శ్రీస్వామివార్ల అలంకార దర్శనానికి మాత్రమే అవకాశం అదేవిధంగా కార్తీకమాసములో మొత్తం 13 రోజులు ( భక్తులరద్దీ అధికంగా ఉండే రోజులు) శ్రీస్వామివార్ల స్పర్శదర్శనం కూడా నిలుపుదల చేసి శ్రీస్వామివార్ల అలంకార దర్శనం మాత్రమే కల్పించబడింది.

### సిబ్బందికి ప్రత్యేక విధులు..



భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆయా సదుపాయాలను కల్పించేందుకై దేవస్థానం శాఖాధిపతులకు, పర్యవేక్షకులకు, ఇతర సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించబడ్డాయి.దాదాపుగా కార్యాలయం సిబ్బంది అంతా కూడా ప్రత్యేక విధులను నిర్వర్తిస్తున్నారు.కార్యనిర్వహణాధికారి ఎప్పటికప్పుడు దర్శనం క్యూలైన్లను, ఆర్జితసేవ క్యూలైన్లను ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

### క్యూలైన్లలో అల్పాహారం..

కార్తీకమాసమంతా క్యూకాంప్లెక్స్ వేచివుండే భక్తులకు నిరంతరం అల్పాహారం, బిస్కెట్లు మరియు మంచినీరు తాగి కాసేపుఅందజేయబడుతున్నాయి. అదేవిధంగా ఈ ఉదయం వేళలలో వేడిపాలు కూడా అందజేయబడ్డాయి.

### కార్తీకదీపోత్సవం..

భక్తులు కార్తికదీపారాధన చేసుకునేందుకు వీలుగా ఆలయ ఉత్తర శివవీధి (మాడవీధి) మరియు గంగాధర మండపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగింది..

### అన్నప్రసాద వితరణ..

భక్తులకు అన్నదాన భవనములో ఉదయం 10.30 నుండి అన్నప్రసాదాల వితరణ చేయబడుతున్నాయి. అలాగే సాయంత్రం గం. 6.30ల నుంచి భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేయబడుతుంది.

### లడ్డు ప్రసాదాలు..

కార్తీకమాసంలో వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన సంఖ్యలో లడ్డు ప్రసాదాలు సిద్ధం చేయబడ్డాయి. మొత్తం 10 కౌంటర్ల ద్వారా ఈ లడ్డు ప్రసాదాలు విక్రయించబడుతున్నాయి.

# ఛట్ పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

**-ప్రముఖంగా కార్తీకమాసంలో జరుపుకునే పూజ ఛట్ పూజ**

**-అత్యంత పవిత్రంగా కొలిచే గొప్ప పండుగ ఛట్ పూజ**





**శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్)** ఉత్తర భారతీయులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఛట్ పూజా సందర్భంగా గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల చెరువు కట్టపై ఏర్పాటు చేసిన ఛట్ పూజా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గాంధీ మాట్లాడుతూ అత్యంత పవిత్రంగా కొలిచే గొప్ప పండుగ ఛట్ పూజ అని, బీహార్, జార?ండ్ మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్గఢ్, చండీగఢ్, గుజరాత్, గయ, రాంచీ, ఢిల్లీ, ముంబై తదితర ప్రాంతాల్లో ప్రముఖంగా కార్తీకమాసంలో జరుపుకునే పూజ ఛట్ పూజ. ఛట్ పూజను దళ ఛట్, ఛతి, సూర్య షష్ఠి అని కూడా అంటారు. మన ప్రాచీన పండుగల్లో ఛట్ పూజ ఒకటి అని అన్నారు. భూమి మీద తమకు మనుగడ కల్పిస్తున్న సూర్య భగవానుడికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ, ఆయురారోగ్య, ఆనందాలను ప్రసాదించమని ప్రార్థిస్తారు. సూర్యుని ఆరాధించడంవల్ల కుష్టు వంటి దీర్ఘకాలిక వ్యాధులు కూడా నయమౌతాయని నమ్ముతారు. పవిత్ర నదిలో పుణ్యస్నానం చేసి నీటిలో వీలైనంత ఎక్కువసేపు నిలబడి సూర్య భగవానుని ఆరాధిస్తారు. దీపాలు వెలిగించి పండ్లు, ఫలాలు ప్రసాదంగా సమర్పిస్తారు అని ప్రభుత్వ విప్ గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ,మంత్రి ప్రగఢ సత్యనారాయణ, శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కే మద్దతు

**: జయసింహా గౌడ్**



ఉప్పల్ ( ప్రశ్న న్యూస్) సిమ్ లయన్ ఫిట్నెస్ అధినేత జయసింహా గౌడ్ ఆధ్వర్యంలో ఫిట్నెస్ ట్రైనర్స్ తో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కి సంపూర్ణ మద్దతు తెలిపిన జిమ్ అధినేత జయసింహ గౌడ్, ఎస్ వి ఎం గ్రాండ్ హెూటల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండారి లక్ష్మారెడ్డికి మద్దతుగా మేమందరం అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫిట్నెస్ ట్రైనర్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బండారి లక్ష్మారెడ్డి మీకు తోడుగా ఉంటాడని మీకు ఎలాంటి సహాయ సహకారం కావాలన్నా మేమందరం తోడుగా ఉంటామని ఎలాంటి కష్టం వచ్చిన కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ట్రైనస్ అందరు కారు గుర్తుకే ఓటేసి బిఎల్ఆర్ ను గెలిపించుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాలకూరి శ్రీకాంత్ గౌడ్, సరిత గౌడ్, జెసిబి రాజు, సంజయ్ జైన్, సోమిరెడ్డి, సెలబ్రిటీస్ సినీ హీరో సందీప్ అశ్వా, చైతన్య, బాడీ బిల్డర్ లావణ్య ,మురళి కృష్ణ, శ్యాంసుందర్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శిల్పారామం లో ఘనంగా బాలల పండుగ



**శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్)** మాదాపూర్ లోని శిల్పారామం లో బాలల పండుగ ఆదివారం తో ముగిసింది. ఉదయం పెయింటింగ్, సాయంత్రం సంగీతం నృత్యం అంశాలలో ప్రదర్శనలు జరిగాయి. దాదాపుగా 150 మంది కళాకారులూ పాల్గొన్నారు. శేషం రమణ శిష్య బృందం వేణువు నాదం,ప్రతిమ శశిధర్ శిష్య బృందం సంగీత విభావరి, డాక్టర్ రమాదేవి శిష్య బృందం, రమణి సిద్ధి శిష్య బృందం, దుర్గేష్ నందిని శిష్య బృందం, అరుణ శ్రీనివాస్ శిష్య బృందం, మృణాళిని శిష్య బృందం,లక్ష్మి నల్లమోలు శిష్య బృందం, శ్రీనివాస్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. బాలలందరికి ప్రశంస పత్రాలు ఇచ్చి ఆశీర్వదించారు.

# శ్రీశైల క్షేత్రంలో నిత్య అన్నదాన వితరణ కు రూ, లక్ష విరాళం




దాతకు బాండు అందజేస్తున్న ఆలయ సహాయ కార్యిర్వహణాధికారి మరియు పర్యవేక్షకులు


శ్రీశైలం(ప్రశ్న న్యూస్ ) శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదానికి,పెద్దారవీడు వాస్తవ్యులు కె. నాగిరెడ్డి 1,00,000/- విరాళాన్ని ఆలయ సహాయ కార్యిర్వహణాధికారి ఫణీంద్ర ప్రసాద్ మరియు పర్యవేక్షకులు ఏ. నాగరాజు కు అందజేశారు. దాతకు స్వామి అమ్మవార్ల దర్శనం దేవస్థానం తరపున స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలు లడ్డూ ప్రసాదం అందజేశారు.

# ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



నకిరేకల్ : బీఆర్ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. తాజాగా నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 200 మంది యువజన కాంగ్రెస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి ఆదివారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య(%మీూా జష్ట్రఅతీబఎబతీష్త్రఎ% )సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నార్కట్ పల్లి మండలం గోపాలాయపల్లి గ్రామానికి చెందిన 20 కుటుంబాలు నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సంక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ తప్పుడు హామీలతో ప్రజలను పక్కదారి పట్టిస్తుందన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ మూడో సారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అందరూ కలిసికట్టుగా బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.


# బాక్స్ ఆఫ్ బోన్స్.. ఇప్పటికీ మిస్టరీగానే..!




అది 1992 మార్చి 30. అమెరికాలోని వ్యోమింగ్‌లోని థర్మోపోలిస్‌లో నివాసముంటున్న న్యూవెల్ సెషన్స్ ఇంట్లో ఉన్నట్టుండి గందరగోళం మొదలైంది. న్యూవెల్, అతడి స్నేహితులు కలసి.. ఓ పాత ట్రంకు పెట్టె తాళాన్ని పగలగొడుతున్నారు. గత ఆరేళ్లుగా అందులో ఏముందనే వారి కుతూహలం.. ఆ పనికి ఉసిగొల్పింది. తాళం ఊడింది. తలుపు తెరుచుకుంది. పాక్షికంగా కప్పిన ప్లాస్టిక్ కవర్‌ను తీసి చూస్తే.. అందులో ఒక బ్యాగ్.. ఆ బ్యాగ్‌లో ఓ మనిషి అస్థిపంజరం విడి భాగాలు ఉన్నాయి. అంతా షాక్. ఒక్కమాటలో చెప్పాలంటే గజగజా వణికిపోయారు. ఆ షాక్‌లోనే న్యూవెల్ భార్య డైసీ.. 'ఇప్పుడు ఏం చేద్దాం' అంది. 'గొయ్యి తవ్వి పూడ్చిపెట్టడం బెటర్' అన్నారంతా. అది మరింత నేరం కావచ్చని డైసీ హెచ్చరించింది. దాంతో న్యూవెల్.. ఆ ట్రంక్ పెట్టెను అక్కడ వదిలిపోయిన తన స్నేహితుడు గాబీ కోసం పరుగుతీశాడు.గాబీ ఎదురు పడగానే.. ట్రంక్ పెట్టె గురించి ఆరా తీసి.. అతడి హావభావాలను గమనించాలనుకున్నాడు. గాబీ 1986లో న్యూవెల్‌కి ఓ షెడ్‌ని అప్పగించాడు. వెళ్తూ వెళ్తూ కొన్ని వస్తువుల్ని అందులో వదిలేసి వెళ్లాడు. వాటిలో ట్రంకు పెట్టె ఒకటి. వదిలేసిన వస్తువుల్ని తీసుకెళ్లడానికి గాబీ చాలా సార్లు షెడ్‌కు వచ్చాడు కానీ..ఆ ట్రంక్ పెట్టెను తీసుకెళ్లే ప్రయత్నమైతే చెయ్యలేదు. 'ఎందుకు?' అని న్యూవెల్ అడగనూ లేదు. ఇప్పుడు గాబీని కలసిన న్యూవెల్.. 'షెడ్‌లో నువ్వు వదిలిపెట్టిన ట్రంక్ పెట్టె గుర్తుందా?' అని అడిగాడు. 'గుర్తుంది.. కానీ దాన్ని నేనెప్పుడూ తెరవలేదు. కొన్నప్పుడే దాని తాళంచెవి మిస్ అయ్యింది. డమ్మీ కీస్‌తో చాలా సార్లు ట్రై చేశా.. కానీ ఓపెన్ కాలేదు..' అంటూ ఎలాంటి తొణుకూ బెణుకూ లేకుండా సమాధానమిచ్చాడు గాబీ.అందులో మనిషి అస్థిపంజరం ఉందని న్యూవెల్ చెప్పగానే.. 'వేళాకోళాలు వద్దు బ్రదర్' అంటూ పెద్దగా నవ్వాడు గాబీ. తాను తమాషా చేయడం లేదని నమ్మించడానికి న్యూవెల్‌కి చాలా సమయమే పట్టింది. అయితే గాబీ సమాధానాల మీద న్యూవెల్‌కి నమ్మకం కుదరలేదు. వెంటనే న్యూవెల్.. జాన్ లమ్మీ అనే అధికారి సాయాన్ని కోరాడు. అతడి సమక్షంలోనే వివిధ పరీక్షల కోసం అస్థిపంజరం ల్యాబ్‌కి తరలింది. ఎడమ పుర్రెలో, ఎడమ భుజంలో బుల్లెట్స్ ఉన్నట్లు ఎక్స్‌రేలు తేల్చాయి. దాంతో పుర్రె ఆకారాన్ని బట్టి చనిపోయిన వ్యక్తి ఊహచిత్రాలను గీయించి .. విడుదల చేశారు పోలీసులు. దీనిపై పత్రికలు కూడా ప్రత్యేక శ్రద్ధచూపించాయి.లమ్మీ వెంటనే.. గాబీని కలసి, తన స్టైల్‌లో ప్రశ్నించాడు. అప్పుడు కూడా గాబీ తడబడలేదు. 'చాలా సార్లు పెట్టె ఓపెన్ చేయడానికి ప్రయత్నించాను. కానీ కుదర్లేదు. దాన్ని ఎక్కడ కొన్నానో గుర్తులేదు. కానీ.. అది 1973 నాటి పెట్టె' అని బదులిచ్చాడు. దాంతో వెంటనే లమ్మీ.. అస్థిపంజరాన్ని చెయెన్నేలోని వ్యోమింగ్ స్టేట్ క్రైమ్ ల్యాబ్‌కు అప్పగించాడు. అక్కడి ల్యాబ్ అధికారి శాండీ మేస్.. ఆ అస్థిపంజరం ఒక పురుషుడిదని, సుమారు 5.9 పొడవు ఉంటాడని తేల్చాడు. అప్పుడే దర్యాప్తు చేస్తున్న అధికారులకు.. గాబీ మిసిసిపీలో ఆత్మహత్య చేసుకున్నాడనే వార్త అందింది. దాంతో ఈ హత్యకు గాబీకి కచ్చితంగా సంబంధం ఉందని తేలినా.. గాబీ లేకుండాపోవడంతో ట్రంక్ పెట్టె కేసుకు బ్రేక్ పడినట్టయింది. అప్పట్లో లయోవా వాసి షెల్లీ స్టాట్లర్(16), ఆమె తండ్రి ఈ కేసుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. 'బహుశా ఆ అస్థిపంజరం మీ తాత జోసెఫ్ ముల్వానీది కావచ్చు'ని స్టాట్లర్ తండ్రి పదేపదే అనుమానించాడు. అయితే అప్పట్లో స్టాట్లర్ పెద్దగా పట్టించుకోలేదు. ఏళ్లు గడిచేకొద్ది.. స్టాట్లర్‌కు తన కుటుంబ చరిత్రపై ఆసక్తి పెరిగింది. ఒకసారి తన అమ్మమ్మ మేరీ అలైస్.. తన భర్త జోసెఫ్ ముల్వానీని తన కొడుకు జాన్ డేవిడ్ మోరిస్ చంపేసి ఉంటాడని బాధపడింది. తన తాత గురించి ఎన్నో ఎంక్వైరీలు చేసిన స్టాట్లర్‌కు 2017 వచ్చేసరికి.. ఆ అస్థిపంజరం తన తాత జోసెఫ్‌దేననే నమ్మకం బలపడింది. వెంటనే తన తల్లి కేథరిన్ డీఎన్ఏతో సరిచూడాలని అధికారులకు సిఫారసు చేసింది. అదే ఏడాది అక్టోబర్ 19న కేథరిన్ నుంచి డీఎన్ఏ నమూనా తీసుకున్నారు అధికారులు. అనుకున్నట్లే ఆ అస్థిపంజరం జోసెఫ్ ముల్వానీదే కావడంతో జాతీయస్థాయిలో ఈ కేసు మరోసారి వార్తలకు ఎక్కింది. జోసెఫ్ ముల్వానీ ఎవరో కాదు. 1941 నాటి ఇల్లినాయిస్ నేషనల్ గార్డ్‌లోని 130వ పదాతిదళంలో సభ్యుడు. 2వ ప్రపంచ యుద్ధం సమయంలో పసిఫిక్ థియేటర్‌కి పోరాటయోధుడిగా వెళ్లాడు. తర్వాత కాలిఫోర్నియాలో రైల్‌రోడ్ వర్కర్ అయ్యాడు. మేరీ అలైస్‌ను వివాహం చేసుకున్నాడు. కేథరిన్, ఓఓ, పాట్రిక్ అనే ముగ్గురు పిల్లలు కూడా ఉన్నారు.

మరి మోరిస్ ఎవరు? మేరీ అలైస్ మొదటి భర్త కొడుకే జాన్ డేవిడ్ మోరిస్. 1963లో జోసెఫ్ లయోవాలో ఇల్లు కొని, అందులోకి కుటుంబంతో సహా మకాం మార్చాడు. ఉన్నట్టుండి జోసెఫ్ అదృశ్యమయ్యాడు. అప్పుడే 16 ఏళ్ల మోరిస్.. జోసెఫ్‌ను హత్య చేసి పాతిపెట్టి ఉంటాడని, ఆ తర్వాత తవ్వి శరీరభాగాలను పెట్టెలో పెట్టి.. థర్మోపోలిస్ తీసుకుని వెళ్లి ఉంటాడని స్టాట్లర్ కుటుంబం భావించింది.ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే.. మోరిస్, గాబీ ఒక్కరే కావడం. మోరిస్ ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో చలామణీ అయ్యాడని దర్యాప్తులో తేలింది. దాంతో గాబీ ఆత్మహత్య కూడా ఒక డ్రామా కావచ్చనే అనుమానాలు బలపడ్డాయి. అయితే నిజం బయటపడక మునుపే.. న్యూవెల్(ట్రంక్ పెట్టె ఓపెన్ చేసిన వ్యక్తి) 2003న, 2009లో మేరీ అలైస్(జోసెఫ్ భార్య) కన్నుమూశారు. 2019 మార్చి 29న వ్యోమింగ్‌లోని బల్లార్డ్ ఫ్యునరల్ హోమ్‌లో జోసెఫ్ కుటుంబ సమక్షంలో పూర్తి సైనిక స్మారక లాంఛనాలతో గౌరవప్రదంగా జోసెఫ్ అంత్యక్రియలు జరిగాయి. మొత్తానికీ ఈ కథలో గాబీ అలియాస్ మోరిస్ ఏమయ్యాడు? అసలు స్టెప్ ఫాదర్ అయిన జోసెఫ్‌ను ఎందుకు చంపాడు? అనేది మాత్రం మిస్టరీగానే మిగిలిపోయింది.

# ఇవి కూడా అల్జైమర్స్ లక్షణాలేనట!!



మామూలు మతిమరపునకు, అల్జైమర్స్‌కీ తేడా చాలామందికి తెలిసిందే. అయినా చెప్పుకోవాలంటే ఏదైనా ఒక వస్తువు ఎక్కడ పెట్టామో మరచిపోవడం మతిమరపు అయితే... అసలు ఆ వస్తువనేదొకటుంటుందనే కాన్సెప్ట్‌నే మరచిపోవడం అల్జైమర్స్. ఉదాహరణగా చెప్పాలంటే... కారు తాళాలను మరచిపోవడం మతిమరపైతే... అసలు కారు డ్రైవింగ్‌నే మరచిపోవడం అల్జైమర్స్ అనుకోవచ్చు.పెద్ద వయసు వచ్చాక చేసే ఆ ఐదు రకాల పనులు అల్జైమర్స్‌ను సూచిస్తాయంటున్నారు లాస్ ఏంజిలిస్‌లోని యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా (యూఎస్‌సీ)కు చెందిన పరిశోధకులు. వారు చెప్పేదాన్నిబట్టి... కాస్త వయసు పైబడ్డాక చేసే పనులు వారిలో అల్జైమర్స్ వచ్చే సూచనలను పట్టి ఇస్తుంటాయని యూఎస్‌సీ అధ్యయనవేత్తలు చెబుతున్నారు. వాటిల్లో కొన్ని సూచనలివి...

1. దుస్తులు తొడుక్కోవడంలో శుభ్రత పాటించకపోవడం, బట్టలు నీట్‌గా ధరించకపోవడం... వీళు పొందిగ్గా కాకుండా నిర్లక్ష్యంగా, మురికిగా దుస్తులు తొడుక్కుంటుంటారు.
2. పార్కింగ్ చేస్తున్నప్పుడు వాహనాన్ని కుదురుగా కాకుండా... ఎలా పడితే అలా పార్కింగ్ చేస్తుంటారు.
3. మంచి ఆరోగ్యకరమైన హాస్యాన్నీ, మంచి అభిరుచితో ఉండే హ్యూమర్ ను కాకుండా... ఒకరు బాధిస్తుంటే ఇతరులు బాధపడుతుంటే చూసి ఆనందించే తరహా హాస్యాన్ని (బ్యాడ్ టేస్ట్ హ్యూమర్ ను / అపహాస్యాలను) ఇష్టపడుతుంటారు.
4. అందరి ముందూ మాట్లాడే సమయంలో పాటించాల్సిన నియమాలు పాటించకపోవడం వంటివి చేస్తుంటారు. ఉదాహరణకు మాట్లాడే సమయంలో విచక్షణ పాటించకుండా ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడటం, పిల్లల ముందు మాట్లాడకుండా ఉండాల్సినవి కూడా మాట్లాడటం, వారి ముందర ఉచ్చరించకుండా ఉండాల్సిన అవాచ్యాలను, అశ్లీల పదాలను పలుకుతుంటారు.
5. అన్నింటికంటే ముఖ్యంగా ఇవ్వకూడని వారికి ఇష్టం వచ్చినంత పెద్దమొత్తంలో డబ్బులు ఇస్తుంటారు. ఇలా చేయడం ద్వారా కొన్ని సమస్యల్లోనూ చిక్కుకుంటుంటారు. కాబట్టి ఓ వయసు దాటక ఇవన్నీ అసంకల్పితంగానూ, చాలా ఎక్కువగానూ చేస్తూ ఉంటే... ఎందుకైనా మంచిది... ఒకసారి డాక్టర్ / న్యూరాలజిస్ట్‌కు చూపించడం చాలా మేలు చేసే అంశం.

# ఇవన్నీ కలిపి బోన్‌లెస్ చికెన్ ముక్కల్ని బొగ్గు మీద కాల్చి తింటే!

చికెన్ కర్రీ, చికెన్ బిర్యానీ బోర్ కొట్టాయా? అయితే బోన్‌లెస్ చికెన్ ముక్కలతో ఇలా ఇండోనేషియన్ వంటకాన్ని ఇంట్లోనే తయారు చేసుకోండి!ఇండోనేషియన్ సటే

**తయారీకి కావలసిన పదార్థాలు:** బోన్‌లెస్ చికెన్ ముక్కలు కేజీ,కబాబ్ స్టిక్స్ ఆరు (చల్లటి నీటిలో రెండు గంటలపాటు నానబెట్టుకోవాలి,కీరా ఒకటి, ఉల్లిపాయ ఒకటి,ఆయిల్ వేయించడానికి సరిపడా.

**మ్యారినేషన్ కోసం:** నూనె మూడు టేబుల్ స్పూన్లు,నిమ్మగడ్డి రెండు రెమ్మలు,వెల్లుల్లి రెబ్బలు రెండు,పసుపు రెండు టీస్పూన్లు,ధనియాల పొడి టీస్పూను,కారం టీస్పూను,ఉప్పు రుచికి సరిపడాతేనె రెండు టేబుల్ స్పూన్లు,

**తయారీ...:** చికెన్ ముక్కలను శుభ్రంగా కడిగి.. మ్యారినేషన్ కోసం తీసుకున్న పదార్థాలన్నీ వేసి కలిపి ఆరుగంటలపాటు నానబెట్టుకోవాల.నానిన చికెన్ ముక్కలను కబాబ్ స్టిక్స్‌కు గుచ్చి బొగ్గు మీద కాల్చాలి.

రెండు పక్కల కాలిన తరువాత కొద్దిగా ఆయిల్ రాసి మరో ఐదు నిమిషాలు మగ్గనివ్వాలి.కీరా, ఉల్లిపాయ ముక్కలు, ఏదైనా సాస్‌తో వేడివేడిగా సర్వ్ చేసుకోవాలి.




బ ర ు వు తగ్గడానికి తీసుకునే ఆహార పానీయాల్లో గ్రీన్ టీ మెరుగ్గా పనిచేస్తుంది. గ్రీన్ టీ ఎంత పాపులర్ అంటే, 'డైట్' అనే పదాన్ని ప్రస్తావించినప్పుడు, గ్రీన్ టీ అందులో తప్పకుండా ఉంటుంది" అని న్యూట్రిషనిస్టులు, డాక్టర్లు చెబుతున్నారు.కామెల్లియా సినెన్సిస్ మొక్క నుండి తయారైన గ్రీన్ టీకి.. ఆకుపచ్చ రంగు కారణంగా దానికి ఆ పేరు వచ్చింది. యాంటీ ఆక్సిడెంట్ల పవర్‌హౌస్‌గా పేరు తెచ్చుకున్న గ్రీన్ టీ నిజంగా బరువు తగ్గడంలో ఎంతవరకూ సహాయపడుతుందో తెలుసుకుందాం?గ్రీన్ టీ వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. టైప్ 2 డయాబెటీస్ వచ్చే రిస్క్ తగ్గుతుందని ఈ పరిశోధనల వల్ల తెలుస్తోంది. దంతాల ఆరోగ్యానికి గ్రీన్ టీ బాగా పని చేస్తుంది. నోటి దుర్వాసన, దంతక్షయం, వివిధ రకాల చిగుళ్ళ వ్యాధులు కలిగించే బ్యాక్టీరియాని గ్రీన్ టీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ నశింప చేస్తాయి. నోటి కాన్సర్ వచ్చే రిస్క్‌ని కూడా గ్రీన్ టీ తగ్గించగలదని తెలుస్తోంది.-బరువు తగ్గడానికి గ్రీన్ టీ పరోక్షంగా ఉపయోగపడుతుంది. ఎందుకంటే వేడి లిక్విడ్ తాగడం వలన ఆహారం తీసుకోవాలనే కోరికను తగ్గిస్తుంది. అలా అని గ్రీన్ టీలో తేనెను అతిగా జోడించ కూడదు.

## గ్రీన్ టీ ఎంత మంచిది?

# నిజంగానే బరువు తగ్గుతారా?





# క్యాన్సర్ మందుతో గుండెపోటుకూ చికిత్సా!?

అదో క్యాన్సర్ మందు. కానీ ఓ పరిశోధనలో భాగంగా వాడినప్పుడు అది గుండెపోటునూ నివారించనన్నుట్లు తేలింది. కాకపోతే ప్రస్తుతం ఎలుకల మీద. అది మానవుల్లోనూ అదే తరహాలో పనిచేయనుందని నిర్ద్వంద్వంగా తేలడంతో భవిష్యత్తులో గుండెపోటునూ నివారించగలదనే ఆశాభావం శాస్త్రవేత్తల్లో వ్యక్తమవుతోంది. అదే జరిగితే భవిష్యత్తులో దాదాపుగా గుండెపోట్లు పూర్తిగా నివారితమయ్యే అవకాశం ఉంది. అదెలాగో చూద్దాం.'మైటోజెన్ యాక్టివేటెడ్ కైనేజ్ ఇన్హిబిటర్' అనేది ఒక ఎంజైమ్ వంటి జీవరసాయనం. దీన్నే సంక్షిప్తంగా 'ఎమ్ఈకే ఇన్హిబిటర్' పిలుస్తారు. ఇది మెలనోమా అనే చర్మ క్యాన్సర్, మలద్వార పెద్దపేగు క్యాన్సర్ వంటి కొన్ని క్యాన్సర్లలో ఓ ఔషధంగా ఉపయగపడుతుంది. ఈ క్యాన్సర్లకు గురైనప్పుడు... అవి విపరీతంగా, అసంఖ్యాకంగా పెరిగిపోయేందుకు కొన్ని రకాల హార్మోనులు దోహదం చేస్తుంటాయి. ఎమ్ఈకే ఇన్హిబిటర్... ఆ హార్మోన్లకు అడ్డుపడి... ఆ క్యాన్సర్ గడ్డలు పెరగకుండా చేస్తుంది. ఇలా క్యాన్సర్ గడ్డల పెరుగుదలను ఆపేసే ఇదే ఔషధం... ఇప్పుడు గుండెపోటునూ నివారిస్తుందని పరిశోధకులు ఆశిస్తున్నారు.

### గుండెపోటులో ఏం జరుగుతుంది?

### ఎందుకొస్తుంది?

గుండెకు కూడా రక్తం అవసరం. దాని ద్వారానే గుండె కండరానికి పోషకాలు, ఆక్సిజన్ అందుతుంటాయి. గుండె కండరానికి రక్తాన్ని సరఫరా చేసే ధమనులను 'కరొనరీ ఆర్టరీస్' అంటారు. వయసు పెరుగుతున్న కొద్దీ రక్తనాళాల్లో ఎంతోకొంత కొవ్వులు చేరుతుంటాయి. ఇలా చేరే కొవ్వులను 'ప్లాక్' అంటుంటారు. మిగతా రక్తనాళాల్లో ప్లాక్ చేరడం అంత త్వరగా అనర్థాలు కలిగించకపోవచ్చుగానీ... గుండె కండరానికి అవసరమైన రక్తం అందకపోతే అది చచ్చుబడిపోవడం వెంటనే ప్రారంభమవుతుంది. ఒకసారి చచ్చుబడిన కండరం మళ్లీ నార్మల్‌గా మారడం దాదాపుగా జరగదు. అలా కండరం చచ్చుబడిపోవడంతో గుండె నుంచి మిగతా అన్ని అవయవాలకూ రక్తప్రసరణ తగ్గిపోతుంది. ఫలితంగా మిగతా అన్ని అవయవాలూ (ముఖ్యంగా మెదడు) చచ్చుబడిపోతాయి. దాంతో మరణం సంభవిస్తుంది.

### శాస్త్రవేత్తలు ఏం చూశారంటే...?


ఇటీవల శాస్త్రవేత్తలు ఓ పరిశోధన నిర్వహించారు. కొన్ని ఆరోగ్యకరమైన ఎలుకలకు రెండు వారాల పాటు ప్రతిరోజూ ఆ మందును ఇంజెక్షన్‌తో ఇస్తూ పోయారు. అటు తర్వాత గుండె ప్రధాన గదుల పనితీరును నిశితంగా పరిశీలించారు. గుండె ఛాంబర్లలోకి ఎంత రక్తం వస్తోంది... అదంతా సమర్థంగా పంప్ అవుతోందా లేదా అన్న అంశాన్నీ జాగ్రత్తగా చూశారు. మందు ఇవ్వని ఎలుకల కంటే మందు వాడిన ఎలుకల్లో 7.7 ఎమ్ఎల్ రక్తం అదనంగా ప్రవహించడాన్ని గమనించారు.ఇంజెక్షన్ ఇవ్వని వాటిల్లో 16 ఎమ్ఎల్ తగ్గింది. అంతేకాదు... గుండెపోటుకు గురైన ఎలుకలకూ ఇదే మందు ఇచ్చి చూసినప్పుడు వాటిలో దాదాపు 90 శాతం ఎలుకలు మరో రెండు వారాలపాటు మామూలుగానే జీవించాయి. ఇవ్వని ఎలుకల్లో కేవలం 70 శాతమే రెండు వారాలు బతికాయి. ఈ ఫలితాలు పరిశోధకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేయడంతో పాటు మరిన్ని కొత్త పరిశోధనలకు దారులు తెరిచాయి. బ్రిటిష్ హార్ట్ ఫౌండేషన్ నిధులు అందించి, నిర్వహించిన ఈ పరిశోధనలో పాలు పంచుకున్న ప్రొఫెసర్ పావులో మదేదూ మాట్లాడుతూ... "ఈ ఫలితాలు మమ్మల్ని ఎంతగానో అబ్బురపరిచాయి.హార్ట్ అటాక్‌లో గుండె కండరానికి పోషకాలు అందక అది మరణిస్తుంది. కానీ ఈ మందు ఇవ్వడం వల్ల తగిన సమయంలోనే (విత్ ఇన్ ద క్రిటికల్ టైమ్) కొత్త రక్తనాళాలు పుట్టుకురావడం... గుండె కండరాన్ని చచ్చుబడనివ్వకుండా చేయడం జరిగాయి. మానవుల గుండె కండరాలపైనా ఇది అలాంటి ఫలితమే కలిగించనుందని మా ప్రాథమిక పరిశీలనలో వెల్లడయ్యింది" అని పేర్కొన్నారు. ఈ పరిశోధన ఫలితాలన్నీ 'జర్నల్ ఆఫ్ క్లినికల్ ఇన్వెస్టిగేషన్' అనే ప్రముఖ మెడికల్ జర్నల్‌లో చోటుచేసుకున్నాయి. ఈ పరిశోధనల నేపథ్యంలో కొద్దిరోజుల్లో ఇదే తరహా పరిశోధనలను మానవులపైనా నిర్వహించేందుకు (హ్యూమన్ ట్రయల్స్‌కు) సన్నాహాలు జరుగుతున్నాయి.

### ఎమ్ఈకే ఇన్హిబిటర్ ఏం చేస్తుంది?

గుండెపోటు వచ్చిన వెంటనే 'ఎమ్ఈకే' ఇన్హిబిటర్ మందును ఇంజెక్షన్ రూపంలో బాధితులకు ఇవ్వగానే ఆరోగ్యకరమైన రీతిలో గుండెకు రక్తం సరఫరా జరగడం మొదలవుతుంది. దాంతో గుండెకండరం చచ్చుబడిపోదు. ఫలితంగా గుండెపోటు ప్రమాదం చాలావరకు తగ్గుతుంది.

### ఇదెలా జరుగుతుందంటే...

ఎమ్ఈకే ఇన్హిబిటర్స్ రక్తంలోకి ప్రవేశించగానే... రక్తనాళాల చుట్టూ అల్లుకుపోయి ఉండే 'పెరిసైట్స్' అనేమూలకణాలను 'రీ%--%ప్రోగ్రామింగ్' చేస్తాయి. దీని ఫలితంగా ఆరోగ్యకరమైన అనేక కొత్త రక్తనాళాలు పుట్టుకొస్తాయి. దాంతో రక్తంలో కొవ్వు పేరుకోవడంతో మూసుకుపోయిన రక్తనాళాలే కాకుండా... రక్తప్రవాహం సాఫీగా జరగడానికి అనేక కొత్త కొత్త, ప్రత్యామ్నాయ రక్తనాళాలు ఉంటాయి. వీటి నుంచి ఎలాంటి అంతరాయం లేకుండా గుండె కండరానికి రక్తం సరఫరా అవుతూ ఉంటుంది. అలా గుండెపోటు నివారితమవుతుంది.



# పెరుగుదల.. ఎందుకిలా?

పిల్లల ఎత్తు గురించి తల్లిదండ్రులకు అనేక అపోహలు, అనుమానాలు ఉంటాయి. ఏవో భయాలు వెంటాడుతుంటాయి. ఒకే వయసు పిల్లల్లో కొందరు పొడవుగా, కొందరు పొట్టిగా ఉండటానికి డీఎన్ఏ, పోషకాహార లోపం, అనారోగ్యాలు.. ఇలా అనేకానేక కారణాలు.

**అపోహ:** యుక్తవయసు తర్వాత పిల్లలు ఎత్తు పెరగడం అసాధ్యం.

**వాస్తవం :** యుక్తవయసుకు వచ్చే ముందు చాలామంది పిల్లలు రెండు అంగుళాలు పెరుగుతారు. యుక్తవయసు రాగానే పెరుగుదల కొంత వేగవంతం

అవుతుంది. అంతేకానీ, యుక్తవయసుతోనే ఆగిపోదు. కొన్నిసార్లు 18-19 ఏండ్లు వచ్చే వరకూ పెరుగుతూనే ఉంటారు. ఇది వివిధ కారణాలపై ఆధారపడి ఉంది.

**అపోహ :** పిల్లల ఎత్తును డీఎన్ఏ మాత్రమే నిర్ణయించగలదు.

**వాస్తవం :** పిల్లల పెరుగుదలలో డీఎన్ఏ పాత్ర 70 నుంచి 80 శాతం వరకూ ఉంటుంది. ఆరోగ్యకరమైన జీవనశైలి, పోషకాహారం, తగిన నిద్ర, వ్యాయామం కూడా పెరుగుదలకు దోహదపడతాయి. ఊబకాయం, పోషకాల కొరత.. ఈ రెండూ పిల్లల ఎత్తుకు మోకాలడ్డుతాయి. తీసుకెళ్లి పొట్టివాళ్ల ఖాతాలో పడేస్తాయి.

**అపోహ :** పాలు తాగడం వల్ల పిల్లలు పొడవు అవుతారు.

**వాస్తవం :** పిల్లల ఎత్తు ఎముక పొడవుపై ఆధారపడి ఉంటుంది. ఎముకలు సరిగా పెరిగేందుకు అవసరమైన విటమిన్-డి, క్యాల్షియం పుష్కలంగా ఉంటేనే అది సాధ్యం. అయితే, చాలామంది తల్లిదండ్రులు పాల ద్వారా మాత్రమే క్యాల్షియం లభిస్తుందని భ్రమపడుతుంటారు. బచ్చలికూర వంటి ఆకుకూరల్లో క్యాల్షియం, ఉదయపు ఎండలో విటమిన్-డి సమృద్ధిగా ఉంటాయి.

ముగింపు : తల్లిదండ్రులు ఇప్పటికైనా అపోహలు వీడాలి. పిల్లల జీవనశైలిలో తగినంత నిద్ర, పోషకాహారంతో కూడిన భోజనం, వ్యాయామం ఉండేలా చూసుకోవాలి. కాబోయే తల్లులు గర్భస్థ దశలోనే సరైన పోషకాలు తీసుకోవాలి. పిల్లల్ని స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలు, ఇతర గ్యాడ్జెట్స్‌కు దూరంగా ఉంచాలి. ఆటపాటలు అలవాటు చేయాలి.



## గోధుమ పిండి, మినపప్పుతో

### రుచికరమైన గ్రీన్ దోసెలు! సాస్‌తో తింటే!



చిన్నా, పెద్దా ఇష్టంగా తినే అల్పాహారం దోసెలు.. రొటీన్‌గా కాకుండా ఈసారి ఇలా గ్రీన్ దోసెలు చేసుకుని తినండి. వైరైటీకి వెరైటీ.. రుచికి రుచి.

**గ్రీన్ దోసెలు చేయడానికి కావలసినవి:** కొత్తిమీర, పుదీనా, కరివేపాకు గుజ్జు - పావు కప్పు
గోధుమ పిండి -3 టేబుల్ స్పూన్లు మినపపప్పు - ముప్పావు కప్పు (4 గంటల పాటు నానబెట్టుకోవాలి)
మెంతులు -అర టీ స్పూన్ (4 గంటల పాటు నానబెట్టుకోవాలి) ఉప్పు - తగినంత, నీళ్లు తగినన్ని
నూనె సరిపడా


**గ్రీన్ దోసెలు- తయారీ:** ముందుగా మినపప్పును, మెంతుల్ని కూడా మిక్సీలో వేసుకుని మెత్తగా పేస్ట్‌లా చేసుకోవాలి. ఒక గిన్నెలోకి ఆ మిశ్రమాన్ని తీసుకుని.. అందులో కొత్తిమీర, పుదీనా, కరివేపాకు గుజ్జు వేసుకుని బాగా కలుపుకోవాలి.అందులో గోధుమ పిండి, తగినంత ఉప్పు, తగినన్నీ నీళ్లు పోసుకుని.. ఉండలు కట్టకుండా దోసెల పిండిలా బాగా కలుపుకోవాలి.తర్వాత స్టవ్ ఆన్ చేసుకుని.. పెనం వేడి చేసుకుని.. కొద్దిగా నూనె వేసుకుని దోసెలు వేసుకోవాలి.అభిరుచిని బట్టి టమాటా ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు వంటివి దోసె మీద వేసుకుని సర్వ్ చేసుకోవచ్చు.వేడివేడిగా ఉన్నప్పుడే నచ్చిన చట్నీతో లేదా సాస్‌తో తింటే భలే రుచిగా ఉంటాయి.

# ఎంత తళుకు..

## ఎనామిల్ మెరుపు!



ముత్యపు మెరుపులా ఎనామిల్ సొగసూ ఇట్టే ఆకట్టుకుంటుంది. అదనపు హంగుల కోసం ఆభరణాలకు ఎనామిల్ వాడటం అన్నది ప్రాచీన కాలం నుంచీ ఉన్నదే. ఏనుగు దంతాలు, పులులు, సింహాల వంటి జంతువుల గోళ్లను ఆభరణాలకు జోడించడానికి ఇదో కారణం. ఎనామిల్ నగలను ఈజిప్టు తవ్వకాల్లోనూ గుర్తించారు. ఉష్ణోగ్రతను బట్టి ఎనామిల్ రంగు మారుతుంది.బంగారం, వెండి రేకులపై కావలసిన ఆకృతిలో.. కృత్రిమంగా తయారుచేసిన ఎనా మిల్‌ను అద్దుతారు. మీనాకారి, జర్దోసీ నగలలో ఎనామిల్ మెరుపులు ఎక్కువే! ఈ ఆభరణాల తయారీలో లోహాలను తక్కువగా ఉపయోగిస్తారు. అందుకే తేలికగా, సౌకర్యంగా ఉంటాయి. అన్నిరకాల దుస్తులకూ నప్పుతాయి. అభిరుచిని బట్టి రాధామాధవులు, పక్షులు, జంతువులతోపాటు రంగవల్లులను కూర్చిన ఆభరణాలను ఎంచుకోవచ్చు. ఒకే డిజైన్‌తో ఉంగరాలు, గాజులు, గొలుసులు, జుంకాలతో కూడిన కాంబోలూ వచ్చేశాయి. ఆలస్య మెందుకు.. ప్రయత్నించండి.



# ట్రిపుల్ నెగెటివ్ బ్రెస్ట్ క్యాన్సర్..

## కారణాలు, లక్షణాలు ఎలా ఉంటాయంటే..!

ఇప్పటికే మహిళల్లో క్యాన్సర్లతో ఇబ్బంది పడిపోతుంటే.. ట్రిపుల్-నెగెటివ్ బ్రెస్ట్ క్యాన్సర్ అనేది వెలుగులోకి వచ్చి మరీ భయపెడుతున్నది. మూడు ప్రధాన విషయాల్లో ప్రతికూల పరీక్షలు చేసేదే ట్రిపుల్-నెగెటివ్ బ్రెస్ట్ క్యాన్సర్గా వైద్యులు పిలుస్తున్నారు. ఈస్ట్రోజపెన్, ప్రొజెస్టెరాన్ హార్మోన్లతో పాటు హెచ్ఈఆర్2 అనే ప్రోటీన్ ఈ ట్రిపుల్-నెగెటివ్ క్యాన్సర్గా వైద్యులు గుర్తించారు. రొమ్ము కణజాలాలు మైక్రోఛానల్స్ ద్వారా చనుమొనకు అనుసంధానమై ఉంటాయి. ఈ ఛానళ్లలో చిన్న కణాలు పేరుకుపోవడం ప్రారంభించినప్పుడు లేదా కణజాలంలో గడ్డలు ఏర్పడినప్పుడు అది క్యాన్సర్ పెరగడం మొదలైనట్లు సంకేతంగా భావించాలి.నేషనల్ బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ ప్రకారం, బీఆర్సీఏ1, బీఆర్సీఏ2 జన్యువులు మహిళల శరీరంలో ఉంటాయి. కొన్ని కారణాల వల్ల ఈ జన్యువులు సరిగ్గా పనిచేయడంలో విఫలమైనప్పుడు, ట్రిపుల్-నెగటివ్ బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. బీఆర్సీఏ1, బీఆర్సీఏ2 జన్యువులలో మ్యుటేషన్ కారణంగా దాదాపు 55 నుంచి 65 శాతం మంది మహిళలు ట్రిపుల్-నెగటివ్ బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఇతర క్యాన్సర్ల కంటే ఇది దూకుడుగా ఉంటుంది. చికిత్స చేయించుకున్నా తిరిగి 3 ఏండ్ల తర్వాత వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. తొలి 5 ఏండ్లలో ప్రాణాంతకం అయ్యే అవకాశాలున్నాయి. ఇది ఇతర రకాలకు పనిచేసే కొన్ని మందులకు స్పందించదు.

**లక్షణాలిలా ఉంటాయి..** రొమ్ము చుట్టూ చర్మం గట్టిపడుతుంది.
రొమ్ములో ముద్దలాంటి పదార్థం చేయికి తగులుతుంది.
రొమ్ము చుట్టూ చర్మం రంగులో మార్పు కనిపిస్తుంది.
చంకల ప్రాంతంలో గడ్డలు వస్తుంటాయి.
చనుమొన నొప్పి వస్తుంది. రంగు మారుతుంది.
చనుమొన లోపలికి తిరిగినట్లుగా ఉంటుంది.
చనుమొన నుంచి ద్రవం కారుతుంది.
రొమ్ము చుట్టూరు ఎరుపు రంగు కనిపిస్తుంది.

**కారణాలేంటంటే..** జన్యు సంబంధ కారకాల వల్ల ట్రిపుల్-నెగటివ్ బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.బీఆర్సీఏ1, బీఆర్సీఏ2 జన్యువులు సరిగా పనిచేయకపోవడం వల్ల మెనోపాజ్ ఆలస్యం కావడం వల్ల అధిక శరీరం బరువు ఉండటం వల్ల రేడియేషన్‌కు ఎక్కువగా గురికావడం వల్ల పీరియడ్స్ నిర్ణీత వయస్సు కంటే ముందే రావడం వల్ల లేట్ ప్రెగ్నెన్సీ వల్ల సిగరెట్ స్మోకింగ్, ఆల్కహాల్ డ్రింకింగ్ వల్ల మెనోపాజ్ తర్వాత హార్మోన్ థెరపీ తీసుకోవడం వల్ల

**ఎవరిలో రిస్క్ ఎక్కువ..** ఇప్పటికే టైప్-1 బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతున్నవారు 50 లేదా అంతకంటే ఎక్కువ వయసు వారు ఎక్కువ కాలం పాటు తల్లిపాలను తీసుకోని వారు రొమ్ము పెద్దగా ఉండేవారు

**ఏ పరీక్షల్లో తెలుస్తుంది..**

రొమ్ము సెల్ఫ్ ఎగ్జామినేషన్ మామోగ్రఫిజి ఆల్ట్రాసౌండ్ బయాప్సీ టెస్ట్ చికిత్స ఇలా ఉంటుంది..సర్జరీ కింద లంపెక్టమీ, మాస్టెక్టమీ రేడియేషన్ థెరపీ కెమోథెరపీజి

**ఇలా జాగ్రత్తపడాలి..**

కుటుంబ చరిత్రలో ఎవరికైనా క్యాన్సర్ ఉన్నట్లయితే పరీక్షలు చేయించుకోవాలి. పెరుగుతున్న ఊబకాయాన్ని నియంత్రించుకోవాలి. శరీరం బరువు పెరిగే ఆహారాలను దూరం పెట్టాలి. వైద్యుల సూచన మేరకు గర్భనిరోధక మాత్రలు వాడాలి. గర్భనిరోధక మాత్రలకు బదులుగా కండోమ్స్ వాడండి. ఆల్కహాల్ డ్రింకింగ్ అలవాటు పూర్తిగా మానుకోవాలి.
జంక్ ఫుడ్ తినకూడదు. ఎక్కువ నీరు తాగుతుండాలి.శరీరంలో ఏదైనా గడ్డ కనిపిస్తే వెంటనే వైద్యుడ్ని సంప్రదించాలి.

# వింటర్ బ్లూస్

## వేధిస్తుంటే..

శీతకాలం రాగానే కొందరిలో తెలియని నీరసం ఆవహిస్తుంది. ప్రతి చలికాలం ఇలానే జరుగుతుంటే.. సీజనల్ ఎఫెక్టివ్ డిజార్డర్ (ఎస్ఏడీ)కు గురవుతున్నట్టు లెక్క. దీన్నే ఆంగ్లంలో **'వింటర్ బ్లూస్' అంటారు. ఈ రుగ్మత లక్షణాలు..**మనసులో అకారణ బాధ, నిరుత్సాహం, నిరాసక్తత, అతిగా తినడం, వేగంగా బరువు పెరగడం, అధిక కార్బొహైడ్రేట్లు ఉన్న ఆహారం తీసుకోవాలనే కోరిక కలగడం, అతి నిద్ర, అలసట.. సీజనల్ ఎఫెక్టివ్ డిజార్డర్‌ను సూచించేవే.చలికాలంలో సూర్యకాంతి తగ్గడం వల్ల శరీరంలోని జీవగడియారం పని తీరుకు అంతరాయం కలుగుతుంది. దీన్నొక కారణంగా చెప్పవచ్చు. ఎండ తక్కువగా తగలడం వల్ల రక్తంలో సెరటోనిన్‌గా పిలిచే ఫీల్‌గుడ్ హార్మోన్ స్థాయులు తగ్గిపోతాయి. ఫలితంగా నిరుత్సాహం, కుంగుబాటు ఆవహిస్తాయి. వంశ పారంపర్యంగానూ వచ్చే ఆస్కారం ఉంది. లోపం ఇదే.. ప్రధానంగా విటమిన్-డి తక్కువగా ఉండే ఆహారం తీసుకునే వారు దీని బారిన పడతారు.

జాగ్రత్త పడాల్సిందే.. శీతకాలంలో వచ్చే ఈ సమస్యల్ని అశ్రద్ధ చేస్తే తీవ్ర అనారోగ్యానికి దారితీయవచ్చు. నలుగురిలో కలవ లేకపోవడం, ఆఫీసులో సరిగ్గా పనిచేయలేకపోవడం ప్రధాన లక్షణాలు. మద్యం, మాదకద్రవ్యాలకు అలవాటు పడవచ్చు. అకారణ దుఃఖం, ప్రతికూల ధోరణులు, ఆత్మహత్య ఆలోచనలు వెంటాడుతాయి.విటమిన్-డి మాత్రలతో పాటు యాంటీ డిప్రెసెంట్స్ ఇస్తారు. వివిధ థెరపీల ద్వారా వైద్యులు చికిత్స చేస్తారు. వ్యాయామం, సమ తులాహారమూ ముఖ్యమే.




# చిన్నారుల్లో ఊబకాయంతో

## మెదడు అభివృద్ధి నిలిచిపోతుందా..?

బొద్దుగా ఉండే పిల్లల్ని మనం ఇష్టపడుతుంటాం. లావుగా ఉండే పిల్లల తల్లిదండ్రులు కూడా మా వాడు బొద్దుగా ఉన్నాడంటూ సంతోషం వ్యక్తం చేస్తుంటారు. అయితే, లావుగా ఉండే పిల్లల్లో పెద్దయ్యాక వారి మెదడు ఆరోగ్యంగా ఉండదు. చిన్ననాట ఎంత లావుగా ఉంటారో పెద్దయ్యాక అంత మెదడు సంబంధ సమస్యలు వస్తాయని పరిశోధకులు గుర్తించారు. చిన్నారుల మెదడు అభివృద్ధి, పిల్లల ఆరోగ్యానికి సంబంధించి దీర్ఘకాలిక అధ్యయనం నుంచి ఎంఆర్ఐ డాటాను పరిశోధకులు విశ్లేషించారు. కౌమార దశకు చేరుకోవడానికి ముందు బలహీన మెదడు, అధిక బరువు, బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) మధ్య సహసంబంధాన్ని గుర్తించారు. కనెక్టికట్ న్యూ హెవెన్‌లోని యేల్ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లో రేడియాలజీ, బయోమెడికల్ ఇమేజింగ్‌లో పోస్ట్-గ్రాడ్యుయేట్ రీసెర్చ్ ఫెలో సిమోన్ కల్టెన్‌హౌజర్ నేతృత్వంలో ఈ అధ్యయనం జరిగింది. ఈ పరిశోధన అధ్యయన పత్రాన్ని రేడియోలాజికల్ సొసైటీ ఆఫ్ నార్త్ అమెరికా వార్షిక సమావేశంలో ప్రదర్శించారు. స్ట్రక్చరల్ ఎంఆర్ఐ, రెస్టింగ్ స్టేట్ ఫంక్షనల్ ఎంఆర్ఐ నుంచి డాటాను విశ్లేషించారు. ఇది మెదడు ఆరోగ్యం పూర్తి సమాచారాన్ని అందించేందుకు రక్తప్రవాహంలో మార్పులను గుర్తించడం ద్వారా మెదడు కార్యకలాపాలను అంచనా వేయడానికి సహాయపడింది. అధిక బరువు, బీఎంఐ జడ్-స్కోర్ ఉన్న చిన్నారుల్లో మెదడులో శరీర నిర్మాణ సంబంధ విషయంలో అసాధరణతలను పరిశోధకులు గుర్తించారు. మెదడుకు సంబంధించి రెండు అర్ధ గోళాల మధ్య ప్రధాన లింక్ అయిన కార్పస్ కాలోసమ్ తెల్ల పదార్థంలో క్షీణతను కనుగొన్నారు. అర్ధగోళాల లోపలున్న ట్రాక్ట్‌లలో కూడా మార్పులు కనిపించాయి. మెదడు బయటిపొర సన్నగా ఉండటం కూడా గుర్తించారు.చిన్నారుల్లో పెరగిన బరువు, బీఎంఐ.. శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. అధిక బీఎంఐ ఉన్న పిల్లల్లో అధ్వానమైన పనితీరు, చదువులో వెనకబడిపోవడం వంటి ఫలితాలు చూపుతాయని పరిశోధకులు పేర్కొన్నారు. చిన్నతనంలో ఊబకాయాన్ని పట్టించుకోకుండా వదిలేస్తే అది చిన్న వయసులోనే మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు వంటి తీవ్ర పరిణామాలను మిగుల్చుతుందని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నివేదికలు హెచ్చరించాయి.



అధిక బరువు ఉండే పిల్లల్లో ఆస్తమాతో పాటు స్లీప్ ఆప్నియా వంటి శ్వాస సమస్యలు కూడా ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉంటాయని వైద్యనిపుణులు చెప్తున్నారు.

# 6 లక్షల పెట్టుబడి.. 4 కుట్టు మిషన్లతో ఆరంభం.. లక్షల్లో ఆదాయం!







ఇరవై ఎనిమిదేళ్ల ఓషియానాకు వ్యాపారం చేయాలన్న ఆశ బలంగా ఉంది. కానీ "ఇంట్లో ఎవరూ వ్యాపారస్థులు లేరు, ఏ అనుభవం లేకుండా వ్యాపారం ఎలా చేస్తావు" అంటూ తల్లిదండ్రులు ఆమె ఉత్సాహంపై నీళ్లు చల్లారు. అయితే అక్కడితో తన ఆశను వదిలేయకుండా, వాళ్లను ఎలాగో ఒప్పించి ఓ స్టార్టప్ ను ప్రారంభించింది. అనుభవం లేకపోయినా అంకిత భావం ఉండటం వల్ల ప్రారంభంలో ఎదురైన అనేక ఆటుపోట్లను ధైర్యంతో ఎదుర్కొంటూ ముందుకు దూసుకుపోయింది. ఫలితం.. ఇప్పుడామె ఆదాయం నెలకు కొన్ని లక్షలు. అలా వ్యాపారం చేయాలన్న ఎంతోమంది ఔత్సాహికులకు ప్రేరణగా నిలుస్తోంది ఓషియానా. ఢిల్లీకి చెందిన ఓషియానా ఎన్ఐఎఫ్టీలో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేసింది. చదువు పూర్తయిన వెంటనే ఓ 'ఫ్యాషన్ ఎక్స్‌పోర్ట్ హౌజ్'లో చేరింది. అక్కడ ఉద్యోగం చేస్తోంది కానీ మనసులో మాత్రం బిజినెస్ చేయాలని బాగా కోరిక. తన కోరికను తల్లిదండ్రుల ముందుంచితే "ఉద్యోగంలో ఎటువంటి రిస్కూ ఉండదు. వ్యాపారం అయితే లాభనష్టాలతో కూడుకున్నది. ఎక్కువ ఒత్తిడికి గురవ్వాల్సి ఉంటుంది. అందుకే ఉద్యోగం చెయ్యి" అని ప్రభుత్వ ఉద్యోగస్థులైన తల్లిదండ్రులు ఆమెను వెనక్కు లాగే ప్రయత్నం చేశారు. కానీ ఓషియానా వారి అభిప్రాయాన్ని సున్నితంగా తిరస్కరిస్తూ తన మనసులో ఉన్న బిజినెస్ ప్లాన్ గురించి వివరించి "మీరు నాకు ఆరునెలలు సమయం ఇవ్వండి. నన్ను నేను నిరూపించుకుంటాను. అది జరగని పక్షంలో మీరన్నట్లే చేస్తాను" అని చెప్పి ఒప్పించింది. తల్లిదండ్రులు ఒప్పుకున్న వెంటనే ఆలస్యం చేయకుండా 2019 ఫిబ్రవరిలో తన స్నేహితుడు సౌరభ్ తోకస్‌తో కలిసి 'మోడ్రన్ మిత్' పేరిట ఓ స్టార్టప్‌ను ప్రారంభించింది. ఓషియానా ఉద్యోగం చేసేటప్పుడు దాచుకున్న డబ్బులు, ఇంకా సౌరభ్ తెచ్చిన కొంత మొత్తం కలిపి ఆరు లక్షల రూపాయలతో.. నాలుగు కుట్టు మిషన్లు, నలుగురు కళాకారులతో రెగ్జిన్ , కార్క్, కాటన్ , పైనాపిల్ వ్యర్థాలు, క్యాక్టస్ ఫైబర్ వంటి వీగన్ పదార్థాలతో బ్యాగ్‌ల తయారీ మొదలు పెట్టింది. చూడటానికి చాలా మోడర్న్‌గా ఉంటూ మన్నికగా ఉండే ఈ బ్యాగ్‌లకు మంచి ఆదరణ లభించింది. విక్రయాలు బాగా జరిగేవి. అలా వచ్చిన లాభాన్ని మళ్లీ దానిలోనే పెట్టుబడిగా పెట్టి వ్యాపారాన్ని మరింత వృద్ధిలోకి తీసుకొచ్చింది. నేడు 15 మంది హస్త కళాకారులు, పది మిషన్లతో మోడ్రన్ మిత్ దూసుకుపోతోంది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉన్న మిత్ కస్టమర్లకు నాణ్యమైన బ్యాగ్‌లు అందించేందుకు ప్రస్తుతం అందుబాటు లో ఉన్న టెక్నాలజీ, లేటెస్ట్ డిజైన్లను వాడుకుని నెలకు 14 నుంచి 20 లక్షల వరకు ఓషియానా ఆర్జిస్తోంది. "ఫ్యాషన్ పరిశ్రమలో డిజైన్ తోపాటు నాణ్యత చాలా ముఖ్యం. అందుకే నేను ముందు మంచి హస్తకళాకారులను అన్వేషించాను. తరతరాలుగా అదే పనిచేస్తోన్న కుటుంబాలకు చెందిన కళాకారులను ఎంపికచేశాను. నా కంపెనీలో పనిచేస్తోన్న కళాకారుల్లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు కూడా ఉన్నారు. వీళ్ల చేతితోనే అందమైన డిజైన్లు రూపొందిస్తారు. రెగ్జిన్ , కార్క్, కాటన్ లను ఢిల్లీ, కోల్‌కతాల నుంచి సేకరించి అందమైన బ్యాగ్‌లు రూపొందిస్తున్నాము. పైనాపిల్ వ్యర్థాలు, క్యాక్టస్ ఫైబర్‌ను కూడా తయారీలో వాడుతున్నాం. వీటివల్ల పర్యావరణానికి హాని కలగదు. మా దగ్గర 130 రకాల బ్యాగ్‌లు తయారవుతాయి. వీటిలో హ్యాండ్ బ్యాగ్స్, టాట్స్, స్లింగ్ బ్యాగ్స్, మేకప్ పౌచ్‌లు, ట్రావెలింగ్, ల్యాప్‌టాప్ బ్యాగ్‌లు ఉన్నాయి. ఎటువంటి వ్యాపార అనుభవం లేని అమ్మాయిగా ప్రారంభంలో నాకు చాలా సమస్యలు ఎదురైనప్పటికీ సౌరభ్ సాయంతో అన్నింటినీ అధిగమించగలిగాను. మా ఉత్పత్తులను ఆన్ లైన్ ద్వారా నేరుగా కస్టమర్లకు చేరుస్తూ వ్యాపారాన్ని లాభాల్లో నడిపిస్తున్నాను. ఎవరైనా స్టార్టప్ ప్రారంభించాలనుకుంటే ముందు ఏ వ్యాపారం చేయాలనుకుంటున్నారో దాన్ని బాగా పరిశోధించి అర్థం చేసుకోవాలి. తర్వాత తక్కువ పెట్టుబడితో ప్రారంభించి దానిపై పట్టు సాధించాక అంచెలంచెలుగా దానిని పెంచుకోవాలి" అని స్టార్టప్ ఔత్సాహికులకు సూచిస్తోంది ఓషియానా.

## వివాహ విందుకు పిలువని అతిథులు
# పిల్లలతో కలిసి వచ్చిన ఎలుగుబంటి



రాయ్‌పూర్: ఒక వివాహ విందుకు పిలువని అతిథులు వచ్చారు. ఒక ఎలుగుబంటి రెండు పిల్లలను వెంటబెట్టుకుని ఫంక్షన్ హాల్‌కు వచ్చింది. అయితే ఆ వేడుక పూర్తయ్యాక అవి రావడంతో ఎవరికీ ఎలాంటి ముప్పు వాటిల్లలేదు. ఛత్తీస్‌గఢ్‌లోని కంకేర్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. ఒక మ్యారేజ్ ఫంక్షన్ హాల్‌లో గ్రాండ్‌గా వెడ్డింగ్ రిసెప్షన్ జరిగింది. వేడుక అనంతరం వధువరులతోపాటు, ఆహ్వానితులంతా అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే ఆ రాత్రి వేళ అనుకోని అతిథి ఆ ఫంక్షన్ హాల్‌కు వచ్చింది. ఒక ఎలుగుబంటి తన వీపుపై రెండు పిల్లలను ఉంచుకుని రిసెప్షన్ వేదిక పైకి వెళ్లింది. అక్కడ వాసన చూసి అటు ఇటు తిరిగింది. కొంత సేపటి తర్వాత అది అక్కడి నుంచి వెళ్లిపోయింది. అయితే వధువరులతోపాటు వేడుకకు వచ్చిన వారంతా అప్పటికే అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో ఆ ఎలుగుబంటి వల్ల ఎవరికీ ఎలాంటి ముప్పు కలుగలేదు. మరోవైపు ఆ సమయంలో ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న సిబ్బంది ఎలుగుబంటి రాకను గమనించారు. ఒక వ్యక్తి తన మొబైల్ ఫోన్‌లో దీనిని రికార్డు చేశాడు. అది ఎలాంటి విధ్వంసం సృష్టించకుండా వెళ్లిపోవడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో నెటిజన్లు ఫన్నీగా పలు కామెంట్లు చేశారు. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) అధికారి పర్వీన్ కస్వాన్ కూడా వీడియోను షేర్ చేశారు. 'బహుశా.. విందు ఏర్పాట్లు వాటికి నచ్చలేదు' అని క్యాప్షన్ పెట్టారు.

# ఫస్ట్ ఉమన్..
## క్లిష్ట పరిస్థితుల్లో గట్టి పోలీస్ ఆఫీసర్



'దేశం క్లిష్టపరిస్థితుల్లో ఉంది ఇప్పుడు' అనేది మన తెలుగు సినిమా డైలాగైతే కావచ్చుగానీ హరియాణాలోని గుర్‌గ్రామ్‌కు వెళితే 'సిటీ క్లిష్ట పరిస్థితుల్లో ఉంది ఇప్పుడు' అనే రియల్ డైలాగ్ లోకల్ లాంగ్వేజ్‌లో అప్పట్లో తరచు వినిపించేది. సిటీ పరిస్థితి క్లిష్టస్థితిలో పడడానికి శాంతిభద్రతల నుంచి ట్రాఫిక్ అస్తవ్యస్తతల వరకు రకరకాల సమస్యలు ఉన్నాయి. ఇలాంటి క్లిష్టసమయంలో గుర్‌గ్రామ్ తొలి మహిళా పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు కళారామచంద్రన్. రేవారి, ఫతేహబాద్, పంచ్‌కుల జిల్లాల సూపరింటెంట్ ఆఫ్ పోలీస్‌గా పనిచేసినా, ఇంటెలిజెన్స్ బ్యూరోలో పనిచేసినా, మేఘాలయాలోని ఈశాన్య ప్రాంత పోలీస్ అకాడమీ హెడ్‌గా పనిచేసినా... కళా రామచంద్రన్ తనదైన ప్రత్యేకతను సృష్టించుకున్నారు. నిఖార్సయిన పోలీస్ ఆఫీసర్‌గా పేరు తెచ్చుకున్నారు. గుర్‌గ్రామ్‌లో చూడచక్కని రోడ్లు ఉన్నాయి. **కానీ ఏంలాభం?** 'వేగమే మా నైజం' అన్నట్లుగా దూసుకుపోతుంటాయి వాహనాలు. దీనివల్ల యాక్సిడెంట్లు, మరణాలు. మరోవైపు డ్రంకెన్ డ్రైవింగ్. ఇంకోవైపు స్ట్రీట్‌క్రైమ్స్. సైబర్‌క్రైమ్, ఈవ్‌టీజింగ్ లాంటి సమస్యలు బోలెడన్ని ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోలీసుల నిష్క్రియాపరత్వం మీద వేడివేడి విమర్శ లు కూడా వచ్చాయి. అలాంటి క్లిష్ట సమయంలో బాధ్యత లు తీసుకున్న కళారామచంద్రన్ 'నగరాన్ని ఏ మేరకు భద్రంగా ఉంచగలరు?' అనే సందేహాలు రాకపోవడానికి కారణం ఆమెకు ఉన్న వృత్తి నిబద్ధత, మంచిపేరు. 'క్షేత్రస్థాయి నుంచి పోలిసు పర్యవేక్షణను బలోపేతం చేసే కార్యాచరణకు శ్రీకారం చుట్టాం' అంటున్నారు కళా రామ చంద్రన్. రకరకాల ప్రాంతాలలో పనిచేసిన అనుభవంతో పాటు, భర్త ఇచ్చిన సూచనలు కూడా గుర్‌గ్రామ్‌ని 'సేఫర్ అండ్ బెటర్' సిటీగా మార్చడానికి ఉపయోగపడతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. కళారామచంద్రన్ భర్త నవదీప్‌సింగ్ సీనియర్ ఐపీయస్ అధికారి. గుర్‌గ్రామ్ పోలీస్ కమిషనర్‌గా పనిచేశారు.







# ట్రెండ్.. ప్రెగ్నెన్సీకి గ్లామర్ ఫొటోషూట్‌కు అదే అనువైన సమయం!

అమ్మ అవడం అనే వరాన్ని ముందస్తుగా పదిలం చేసుకోవాలనే ఆరాటం ఇటీవల సోషల్ మీడియా పోస్టుల్లో విరివిగా కనిపిస్తోంది. తమ జీవితంలోకి కొత్త అతిథి రాబోతున్నాడనే సూచనను నలుగురికి తెలియజేయాలనే తపనతో పాటు, గర్భంతో ఉన్న అందమైన ఫొటోలను సంతోషంగా షేర్ చేస్తున్నారు. వెండితెర, బుల్లితెర నటీమణులు కూడా ఈ ఆసక్తిని మరింతగా పెంచుతున్నారు. గర్భం అనేది స్త్రీకి జీవితంలో ఒక ప్రత్యేక దశ. తల్లిగా మారే ఈ ప్రయాణంలో కొన్ని కష్టాలు ఎదురైనా ఆనందాన్ని నింపుతుంది. ఇటీవల నటి కాజల్ అగర్వాల్, శ్వేతా అగర్వాల్‌ల బేబీ బంప్ ఫొటోలు నెట్టింట బాగా వైరల్ అయ్యాయి. వారిలాగే ఫొటో షూట్స్ చేసుకోవడానికి ఆసక్తి చూపేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మెటర్నిటీ ఫొటోషూట్ ఎప్పుడూ గుర్తుండిపోయేలా, ప్రత్యేకంగా ఉండాలనుకునే ట్రెండ్ జోరందుకుంది. కాలేజీ, ఉద్యోగం, పెళ్లిరోజులను ఎంజాయ్ చేయడం ఎంతగా ఇష్టపడతారో అదేవిధంగా ప్రెగ్నెన్సీని పండగలా జరుపుకోవడం నేటి రోజుల్లో అతి ముఖ్యమని ఈ ఫొటోలు చూపుతున్నాయి. ఈ ఫొటోషూట్స్ కోసం ఫొటోగ్రాఫర్లు తమ స్టూడియోలను ప్రత్యేకంగా డిజైన్ చేస్తున్నారు. విభిన్న రకాల డ్రెస్ డిజైన్లనూ గర్భవతుల కోసం రూపొందిస్తున్నారు.

### అనువైన సమయం

'బేబీ బంప్ ఫొటో షూట్‌కి ఏడు-ఎనిమిది నెలల సమయం అనువైనది' అంటున్నారు హైదరాబాద్‌లో బేబీ, ప్రెగ్నెన్సీ ఫొటోగ్రాఫర్‌గా పేరొందిన మనోజ్ఞ. 'ఈ సమయంలో పొట్టభాగం బాగా కనిపిస్తుంది. పసిపిల్లలను ఫొటోషూట్ చేయడం కన్నా ఇది త్వరగా పూర్తవుతుంది కాబట్టి గర్భవతులకు అలసట ఏమీ ఉండదు. డ్రెస్ కలర్స్, డిజైన్స్ కోసం మాత్రం ప్రత్యేక శ్రద్ధ పెడతాం. ఒక కలర్ థీమ్‌తో అన్ని సైజుల డ్రెస్సులను డిజైన్ చేసి ఉంచుతాను. ఇందుకు విదేశీ డిజైనర్స్‌తోనూ చర్చలు జరుపుతాను' అంటారీమె.

### ఎందుకు పెరుగుతోంది అంటే..

'కాబోయే తల్లితండ్రులు తమ జీవితంలోకి అడుగిడబోయే కొత్త అతిథిని విభిన్న రకాలుగా ఆహ్వానించడానికి ఆసక్తి చూపుతుంటారు. కొందరు తమ చేతులపై పసిపాప మెహెందీ డిజైన్ చేయించుకొని, ఆ ఫొటోను పోస్ట్ చేస్తూ తాము తల్లిదండ్రులు కాబోతున్న విషయాన్ని పంచుకుంటారు. తమ ప్రెగ్నెన్సీ వార్తలను రకరకాలుగా షేర్ చేయడం లాగే మెటర్నిటీ ఫొటోలను కూడా పంచుకుంటున్నారు' అంటారు ఫొటోగ్రాఫర్లు. ఇందుకు సంబంధించి తమ స్టూడియోని ప్రెగ్నెన్సీ షూట్‌కి అనువుగా మార్చుకున్నామని చెబుతున్నారు.






### థీమ్‌లకు పెరిగిన డిమాండ్

కాన్సెప్ట్ షూట్, బ్యాక్‌డ్రాప్ మొత్తం సాదాగా ఉండేలా, ఒంటరిగా దిగే సోలో థీమ్, బోహో థీమ్, డ్రేప్ షాట్.. వంటి థీమ్స్ ప్రస్తుతం డిమాండ్‌లో ఉన్నాయి అంటున్నారు ఫొటోషూట్స్ ఏర్పాటు చేసేవాళ్లు. ఈ ఫొటో షూట్‌ల సమయంలో హెయిర్ స్టైల్, మేకప్, డ్రెస్ వరకూ ప్రతి దానికీ తమ ప్రొడక్షన్ హౌజ్ నుంచే బాధ్యత తీసుకుంటున్నారు. ఫొటోషూట్ ఖర్చు కూడా ప్రొడక్షన్ హౌజ్, థీమ్, అందులో ఉపయోగించే వస్తువులపైన ఆధారపడి ఉంటుంది. అయితే, ఈ ప్రెగ్నెన్సీ ఫొటో షూట్ విషయంలో ఖర్చుకు వెనకాడటం లేదన్నది వాస్తవం.

### ఫ్లయింగ్ డ్రెస్ స్టైల్‌లో..

ప్రీ వెడ్డింగ్ షూట్ వీలుపడనివారు ఈ ప్రెగ్నెన్సీ షూట్ పట్ల మరింత ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రసవం తర్వాత కంటే గర్భంతో ఉన్నప్పుడు జంటగా ఫొటోలు తీసుకోవడానికి ఇష్టపడుతున్నారు. చాలావరకు బ్రైట్ కలర్స్, ఫ్లయింగ్ డ్రెస్ స్టైల్‌కి మొగ్గు చూపుతున్నారు. ప్రెగ్నెన్సీ ఫొటోషూట్‌కి 2 నుంచి 3 గంటల సమయం కేటాయించాల్సి ఉంటుంది. ఔట్‌డోర్ అయితే గర్భిణులు త్వరగా అలసిపోయే అవకాశం ఉంది. అదే, స్టూడియోలో అయితే విశ్రాంతి తీసుకుంటూ ఫొటోషూట్ పూర్తి చేయవచ్చు. దానికి తగిన విధంగా స్టూడియో థీమ్ ఉంటుంది. శారీస్‌తోనూ ఫొటోషూట్ చేస్తాం. కానీ, సీమంతం సమయంలో తీసే ఫొటోలతో గర్భిణులు సంతృప్తిపడతారు. అందుకే చాలా వరకు వెస్ట్రన్‌వేర్‌లో కనిపించాలనుకుంటారు. లాంగ్ ఫ్లయింగ్ స్టైల్ ప్లెయిన్ గౌన్లను బాగా ఇష్టపడుతున్నారు.

# వేసవి సెలవుల్లోనూ పిల్లలు నాలుగు గోడల మధ్యే ఉన్నారా?





ఎండకాలం సెలవుల్లో కూడా పిల్లలు నాలుగు గోడల మధ్య ఉన్నారా? వారికి మీరు పాదలేపనం పూయడం లేదనే అర్థం. వారి చేతికి కథల పుస్తకం ఇవ్వండి. అందులో రాకుమారుడు వద్దన్నా ఉత్తరం వైపుకు వెళతాడు. పిల్లలూ వెళతారు. రాక్షసుడు ఉన్న చోటుకు గండభేరుండ పక్షి మీద చేరుకుంటాడు. పిల్లలూ చేరుకుంటారు. తెలివైన కొడుక్కే రాజ్యం ఇస్తానని రాజు అంటే ఆ తెలివి పుస్తకం చదివే పిల్లలకూ వచ్చి జ్ఞానరాజ్యం దక్కుతుంది. వేసవి అంటే పిల్లలకు ఆటలు పాటలతోపాటు పుస్తకం కూడా. వారి చేతి నుంచి ఫోన్ లాక్కోండి. పుస్తకం ఇవ్వండి. ఇప్పటిలా పాడుకాలం కాదు. పూర్వం ఎండాకాలం సెలవులు ఎప్పుడొస్తాయా అని పిల్లలు కాచుక్కూచునేవారు. దేనికి? ఆడుకోవచ్చు. పాడుకోవచ్చు. కాని అసలు సంగతి కథలు ఎంత సేపైనా చదువుకోవచ్చు. అందుకే ఎదురుచూపు. పక్కింటి నుంచి, ఎదురింటి నుంచి, అద్దె పుస్తకాల షాపుల నుంచి చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు, బుజ్జాయి, బాలజ్యోతి... ఇన్ని మేగజీన్లు... చాలక పాకెట్ సైజు పిల్లల నవలలు 'మంత్రాల అవ్వ.. తంత్రాల తాత', 'భైరవ ద్వీపం','కపాల మాంత్రికుడు', 'పేదరాశి పెద్దమ్మ'... ఇవన్నీ చదవడం... చాలనట్టు మేజిక్ ట్రిక్కుల పుస్తకాలు, లెక్కలతో చిక్కులు, సైన్సు ప్రయోగాలు, సూపర్‌మేన్.. స్పైడర్‌మేన్ కామిక్స్... వీటన్నింటిలో కూరుకుపోయేవారు... ఊహల లోకాల్లో తేలిపోయేవారు. వేసవి కాలం మండే ఎండల కాలం అందరికీ. పిల్లలకు మాత్రం కథలు చదివే కాలం. పుస్తకాల్లో మునిగే కాలం. సింద్‌బాద్... గలీవర్.. బాల్యంలో పుస్తకాలు చదివితే ఏమవుతుంది? సింద్‌బాద్.. గలీవర్ తెలుస్తారు. జీవితం అంటే ఉన్న చోటునే ఉండిపోవడం కాదని.. కదలాలని.. కొత్త ప్రపంచాలను చూడాలని... మనుషులను తెలుసుకోవాలని తెలుస్తుంది. అపాయాలు వచ్చినా విజయం వరిస్తుందనే ధైర్యం వస్తుంది. సింద్‌బాద్ సాహసాలు పిల్లల్ని ఉత్కంఠ రేపేలా చేస్తాయి. అతడు చేసిన సముద్ర యానాలలో ఎన్ని వింతలు. విడ్డూరాలు. సినిమా చూస్తే, గేమ్స్ చూస్తే వీలుకాని ఊహ, కల్పన చదవడం వల్ల పిల్లలకు వస్తుంది. వారి ఊహల్లో తామే సింద్‌బాద్‌లు అవుతారు. మత్స్యకన్యను చూస్తారు. రాకాసి సముద్రజీవితో తలపడతారు. ఇక గలీవర్ చేరుకునే లిల్లీపుట్ ల దేశం ఎంత వింత. చీమంత ఉన్నా వాళ్లు అందరూ కలిసి అపాయాన్ని ఎదుర్కొనాలని చూస్తారు. ఆ తర్వాత గలీవర్ మంచివాడని గ్రహిస్తారు. స్నేహితులను శత్రువులుగా పొరపడటం, శత్రువులను స్నేహితులుగా నమ్మడం ఈ పాఠాలు పిల్లలకు కథలే చెబుతాయి. అప్రమత్తం చేస్తాయి.

**సమయస్ఫూర్తి :** కథలు చదివితే సమయస్ఫూర్తి వస్తుంది. కఠినమైన సన్నివేశాలను కూడా సమయస్ఫూర్తితో దాటడం తెలుస్తుంది. మర్యాద రామన్న, బీర్బల్, తెనాలి రామలింగడు, షేక్ షిల్లీ, ముల్లా నసీరుద్దీన్, మర్యాద రామన్న వీరందరూ తమ కామన్‌సెన్స్‌ను ఉపయోగించే జటిల సమస్యలను ఛేదిస్తారు. పదహారు భాషలు తెలిసిన పండితుడు తన మాతృభాష కనిపెట్టమన్నప్పుడు తెనాలి రామలింగడు ఏం చేశాడు... ఒకే బిడ్డను ఇద్దరు తల్లులు నా బిడ్డంటే నా బిడ్డని కొట్లాడినప్పుడు మర్యాద రామన్న ఏం చేశాడు ఇవన్నీ పిల్లలకు తెలియాలి. అందుకు కథలు చదవాలి. ఇక చందమామలో చాలా కథలు పరీక్షలు పెడతాయి. ముగ్గురు వ్యక్తుల్లో ఎవరు తెలివైన వారైతే వారికి ఉద్యోగం, రాచకొలువు, సింహాసనం దక్కుతుందనుకుంటే సాధారణంగా మూడోవ్యక్తే గెలుస్తాడు. అతని తెలివి పిల్లలకు తెలుస్తుంది. నీతి- బతుకునీతి దేశదేశాల నీతి కథల భాండాగారం పిల్లల కోసం సిద్ధంగా ఉంది. మన పంచతంత్రం, అరేబియన్ నైట్స్, ఈసప్ కతలు... ఇవన్నీ నీతిగా బతకడం గురించి బతుకులో పాటించాల్సిన నీతి గురించి తెలియచేస్తాయి. బంగారు కడియం ఆశ చూపి గుటుక్కుమనిపించే పులులు, నమ్మించి మోసం చేసే గుంటనక్కలు జీవితంలో ఎదురుపడతాయని చెబుతూనే కలిసికట్టుగా ఉంటే వలను ఎగరేసుకుపోయి తప్పించుకోవచ్చని చెప్పే పావురాలను, వలను కొరికి ఉపయోగపడే స్నేహితులను చూపుతాయి. గుండె చెట్టు మీద ఉంది అని చావుతెలివి చూపి మొసలి నుంచి కాపాడుకునే కోతి పాఠం తక్కువది కాదు. నోర్మూసుకోవాల్సిన చోట నోరు మూసుకోకుండా తెరిచి ఆకాశం నుంచి కిందపడే తాబేలును చూసి ఎంతో నేర్చుకుంటారు. అత్యాశకు పోతే బంగారు గుడ్లు దక్కవని తెలుసుకుంటారు. రాకుమారుని వెంట ఎన్నో కతల్లో రాకుమారుడు సాహసాలు చేస్తాడు. పేదరాశి పెద్దవ్వ దగ్గర బస చేస్తే'ఏ దిక్కయినా వెళ్లు కాని ఉత్తర దిక్కు మాత్రం వద్దు' అంటుంది. రాకుమారుడు అటే వెళ్లి కష్టనష్టాలకు ఓర్చి విజయం సాధిస్తాడు. రిస్క్ అవతల కూడా అద్భుత విజయం ఉంటుంది అని ఈ కథలు చెబుతాయి. భట్టి విక్రమార్క కథలు తెగువను నేర్పిస్తాయి. ఎంతటి భయంకర మాంత్రికుణ్ణయినా ప్రాణం కనిపెట్టి తుద ముట్టించవచ్చని ఇతర కథలు చెబుతాయి. కథలు చదివిన వారి తెలివి, భాష, వకాబులరీ, ఉచ్ఛరణ... ఇవన్నీ కథలు చదవని వారి కంటే ఎక్కువ ఉన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. స్కూళ్లు తెరిస్తే ఎలాగూ ఆ పాఠాల్లో పడక తప్పదు. నెల రోజులు దాదాపు చేతిలో ఉన్నాయి. పిల్లల్ని పుస్తకాల లోకంలోకి తోయండి.

ప్రజాప్రశ్న



# గ్రేటర్ ఓటర్ ఎటువైపు.?

ఓటర్లను ఇంటింటికీ వెళ్లి కలుస్తున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో వివరిస్తూ ఓట్లు అడుగుతున్నారు. ఇక గ్రేటర్ మున్సిపల్ ఎన్నికల్లో 47 కార్పొరేటర్లను గెలిచిన బీజేపీ ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో గెలవాలని భావిస్తోంది. ఇందుకోసం జనసేనతో కూడా పొత్తు పెట్టుకుంది. సెటిటర్లతోపాటు, పవన్ ఫ్యాన్, గ్రేటర్ యూత్ బీజేపీకి ఓటు వేస్తారని కమలం నేతలు భావిస్తున్నారు.

### అన్ని పార్టీల్లో ప్రత్యేక ప్రణాళిక

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరు అందుకుంది. రాజకీయ పార్టీలు హోరా హోరీగా ఎన్నికల ప్రచారం దూసుకుపోతున్నాయి. ప్రాంతం, సామాజిక వర్గాల వారీగా ఓటర్లను చేరువ అయ్యేందుకు రాజకీయ పార్టీలు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయి. పక్కాగా ఓటింగ్ తమ వైపు తిప్పుకునేలా ప్లాన్ అమలు చేస్తున్నాయి. ఇటు గ్రేటర్ హైదరాబాద్‌లో ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల వారు ఉండడంతో వారి ఓట్లపై మూడు పార్టీలు దృష్టిపెట్టాయి. ఇందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని ముందుకు సాగుతున్నాయి.

### సెటిలర్లే కీలకం

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎక్కువగా ఆంధ్ర , రాయలసీమతో పాటు ఉత్తర భారత దేశానికి చెందిన ఓటర్లు పలు నియోజకవర్గాల్లో భారీగా ఉన్నారు. 2014, 2018 ఎన్నికల్లో వీరి ఓట్లను రాజకీయ పార్టీలు కీలకంగా భావించాయి. ఇప్పుడు కూడా హోరా హోరీగా జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇతర ప్రాంతాలకు చెందిన వారి ఓట్లు తమ వైపు తిప్పుకునే పనిలో మూడు పార్టీలు ఉన్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థులు ఆయా సామాజికవర్గ నేతల భేటీలు పూర్తి చేసే పనిలో ఉన్నారట. ఇక సిట్టింగులపై ఉన్న వ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నాయి. సిట్టింగులు చేసిన అవినీతి, అక్రమాలు, వైఫల్యాలను ఎండగడుతున్నారు.

### బీఆర్ఎస్ ఇలా

2014 ఎన్నికల్లో గ్రేటర్‌లో ఎక్కువ సీట్లు గెలవకపోయినా.. 2018 వచ్చే సరికి పూర్తి స్థాయిలో విపక్ష పార్టీలపై పైచేయి సాధించింది బీఆర్ఎస్. ఇప్పుడు కూడా గ్రేటర్‌లో అదే స్థాయిలో సీట్లు తమ ఖాతాలో వేసుకోవాలని వ్యూహాలలో మునిగి తేలుతోంది గులాబీ పార్టీ. ఎంఐఎంతో పొత్తు గ్రేటర్‌లోనే ఎక్కువగా లాభిస్తోందని లెక్కలు వేసుకుంటోంది.

### బీజేపీ వైపు యూత్

ఇక నగరాలు, పట్టణాల్లోని యువత ఎక్కువగా బీజేపీ వైపు ఉంటుంది. ఈసారి కూడా గ్రేటర్ యూత్ బీజేపీవైపు నిలుస్తుందని అంచనా వేస్తోంది. గత మున్సిల్ ఎన్నికల్లో ఎక్కువ కార్పొరేషన్లలో విజయం సాధించినందున, ఆ ప్రభావం కూడా కలిపి వస్తుందని, అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకత, ఒక వర్గానికే బీఆర్ఎస్ అనుకూలంగా వ్యవహరిస్తున్న తీరు బీజేపీకి ఆభిస్తుందని కమలనాథులు లెక్కలు వేసుకుంటన్నారు. జనసేనతో పొత్తు కలిసి వస్తుందని పేర్కొంటున్నారు. ఇక ఈనెల 27న ప్రధాని మోదీ నిర్వహించే రోడ్‌షో గ్రేటర్ ఓటర్లను కమలంవైపు ఆకర్షిస్తుందని అంటున్నారు.

### కాంగ్రెస్ స్పెషల్ ప్లాన్

ఇక కాంగ్రెస్ కూడా గ్రేటర్‌లో పట్టు కోసం ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తోంది. టీడీపీ పోటీ చేయకుండా కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తుండడంతో గ్రేటర్ పరిధిలోని ఆంధ్రా, రాయలసీమ ఓటర్లు తమకు ఓటు వేస్తారని భావిస్తోంది. ఇందుకోసం ప్రణాళికాబద్ధంగా ప్రచారం చేస్తున్నారు. ప్రధానంక కమ్మ, కాపు ఓటర్లు ఈసారి కాంగ్రెస్‌వైపు చూస్తున్నారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, అధికార పార్టీ ఎమ్మెల్యేల కబ్జాలు, ఆగడాలు తమకు లాభిస్తాయని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.మొత్తంగా గ్రేటర్ హైదరాబాద్‌లో ఓటర్ల ఎటువైపు ఉంటారు అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. గ్రేటర్ ఓటరు ఎటువైపు మొగ్గ చూపుతారు ఈసారి ఏ పార్టీ పట్టు సాధిస్తుంది అనేది అన్నది తెలియాలంటే డిసెంబర్ 3 వరకు ఆగాల్సిందే.

# మోడీ వర్సెస్ గెహ్లాట్ పోరు

మోడీ అన్నట్లుగా వాతావరణాన్ని మార్చేస్తోంది. బీజేపీకి సీఎం అభ్యర్థి లేకపోవడంతో ప్రధాని మోడీ అంతా తానే అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారు. అంతే కాదు అశోక్ గెహ్లాట్ నే ఎక్కువగా టార్గెట్ చేస్తున్నారు. తద్వారా గెహ్లాట్ కూ, తనకూ మధ్య పోరు అన్నట్లుగా మోడీ ప్రచారం చేస్తున్నారు.జాదూగర్ పేరుతో అశోక్ గెహ్లాట్ ను పదే పదే టార్గెట్ చేస్తున్న ప్రధాని మోడీ రాజస్తాన్ ఎన్నికల్లో తనను చూసి బీజేపీకి ఓటేయాలని కోరుతున్నారు. దీంతో బీజేపీ నేతలు కూడా ప్రధాని మోడీ ప్రచారాల్ని ఎక్కువగా జనంలోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాగే బీజేపీ సోషల్ మీడియా కూడా ప్రధాని మోడీ వ్యాఖ్యల్ని ఎక్కువగా హైలెట్ చేస్తోంది. అసలే రాజస్తాన్ లో ఒపీనియన్ పోల్స్ లోనూ ఈసారి బీజేపీకి మొగ్గు ఉండొచ్చన్న అంచనాలతో కాంగ్రెస్ డిఫెన్స్ లో పడుతోంది. ఇదే అదనుగా బీజేపీ తమ ప్రచారాన్ని ముమ్మరం చేస్తోంది. తాజాగా అశోక్ గెహ్లాట్-సచిన్ పైలట్ మధ్య వైరాన్ని ప్రధాని మోడీ పదే పదే ప్రస్తావిస్తున్నారు. పైకి వారిద్దరూ ఒకటే అన్నట్లుగా కనిపిస్తున్నా వారు ఒకరినొకరు రనౌట్ చేసుకునే బ్యాట్స్ మెన్ అంటూ వ్యాఖ్యానిస్తున్నారు. తద్వారా వరల్డ్ కప్ సీజన్ లో ఓటర్లను ఆకట్టుకునేదుకు ప్రయత్నిస్తున్నారు.

# ఒక్క ఛాన్స్ ఇవ్వండి, అభివృద్ధి అంటే చూపిస్తాం

నలుగురికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు.

### ఆ మూడు పార్టీలు ఒక్కటే

నిర్మల్ జిల్లా ఖానాపూర్ కాంగ్రెస్ విజయభేరీ బహిరంగసభలో ప్రియాంక గాంధీ పాల్గొన్నారు. ధరణి పోర్టల్ అంతా తప్పులు తడకగా ఉంది ఇలాంటి ధరణిని బంద్ చేసి భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పారు. బీజేపీ పెద్ద కంపెనీల దోస్తాతో దేశాన్ని నాశనం చేస్తోందని విమర్శించారు. దేశంలో మోడీ తెలంగాణలో కేసీఆర్ ఇద్దరు ప్రజల రక్తం తాగుతున్నారని ఘాటుగా స్పందించారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఈ మూడు ఒక్కటే పక్కపక్కనే ఉంటూ నాటకాలు వేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, 2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేస్తామని ఆమె స్పష్టం చేశారు. ఉద్యమకారుల కటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని, ఏక కాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారు.

### మోదీ మౌనం దేనికి

తెలంగాణలో జరిగే అవినీతిపై ప్రధాని మోదీ ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతల ఇళ్లలోనే ఐటీ దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 6 గ్యారంటీ పథకాలను ఖచ్చితంగా అమలు చేస్తామని ప్రియాంక గాంధీ స్పష్టం చేశారు. కాళేశ్వరం, మిషన్ భగీరథలో భారీగా అవినీతి జరిగిందని ప్రియాంక గాంధీ ఆరోపించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ నేతలు పెద్దలకే రుణమాఫీ చేస్తారని, రైతులు, కార్మికుల రుణాలను మాత్రం మాఫీ చేయదని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ వైఫల్యం వల్లే యువత ఆత్మహత్యలు జరుగుతున్నాయని ప్రియాంక అన్నారు. గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధికి ఇందిరాగాంధీ ఎంతో కృషి చేశారని, ఆమె మరణించి 40 ఏళ్లు అయినా ఇంకా ఆరాధిస్తున్నారని చెప్పుకొచ్చారు.

### కాంగ్రెస్ కే తెలుసు

ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని, తెలంగాణను ఎలా అభివృద్ధి చేయాలో కాంగ్రెస్‌కు తెలుసునని అన్నారు. ఇక్కడి ప్రజల ఆకాంక్షలు తెలిసే సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని, సిద్ధాంతాల ఆధారంగా నడిచే పార్టీ కాంగ్రెస్ అని ప్రియాంక వ్యాఖ్యానించారు. పార్టీ అధికారంలోకి రాగానే పక్కా ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని మహిళలకు హామీ ఇచ్చారు. 10లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ తో పాటు యువ వికాసం స్కీం తీసుకొస్తామన్నారు. ప్రతి జిల్లాలో ఇంటర్నేషనల్ స్కూల్ కట్టిస్తామని హామీ ఇచ్చారు. ఒక్క ఛాన్స్ ఇవ్వండి తెలంగాణలో అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామని ప్రియాంక ఓటర్లను అభ్యర్థించారు.

# తెలంగాణ ఎన్నికల్లో ఈసీ కీలక నిర్ణయం

ఈవీఎంలకు ఆర్డర్ పెట్టింది. గతంలో 4978 ఈవీఎంలను మంజూరు చేసిన ఈసీ ఇప్పుడు తాజాగా ఈ అదనపు ఈవీఎంల కోసం ఆర్డర్ ఇచ్చింది. దీనికి కారణం ఎన్నికల్లో దాఖలైన భారీ నామినేషన్లే. సాధారణంగా ప్రతీ అసెంబ్లీ సెగ్మెంట్ కోసం ఎన్ని ఈవీఎంలు అవసరం అవుతాయన్న దానిపై ఈసీకి ఓ అంచనా ఉంటుంది. కానీ ఈ అంచనాల్ని కూడా దాటేసి నామినేషన్లు దాఖలు కావడంతో అదనపు ఈవీఎంలను తెప్పించాల్సి వస్తోంది.తెలంగాణలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ పడుతున్న అభ్యర్థులు ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండటంతో అదనంగా 4,368 యూనిట్లు అవసరం అయ్యాయి. అయితే ఈ ఈవీఎంలన్నీ హైదరాబాద్ జిల్లాకే అవసరం అవుతుండటం ఇక్కడ మరో విశేషం. ఈసీ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ జిల్లాలో తాజాగా ఆర్డర్ పెట్టిన ఈవీఎంలతో కలిపి మొత్తం ఈవీఎంల సంఖ్య 9,346కు చేరింది. ఇది 125 శాతం అదనంగా అంచనా వేశారు. హైదరాబాద్ పార్లమెంటు సీటు పరిధిలోకి వచ్చే నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి 32 మందికి పైగా అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఇందులో ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు మూడు బ్యాలెట్ యూనిట్లు అవసరం కాగా.. ఈ సెగ్మెంట్లలో 16 మందికి పైగా అభ్యర్థులు బరిలో ఉన్నందున 11 నియోజకవర్గాలకు రెండు యూనిట్లు అవసరం అవుతున్నాయి. అలాగే మూడు నియోజకవర్గాల్లో 16 కంటే తక్కువ మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నందున ఒక బ్యాలెట్ యూనిట్ మాత్రమే సరిపోతుంది.

# ప్రైవేటు స్కూళ్లకు జగన్ సర్కార్ వరాలు

ప్రైవేటు స్కూళ్లకు ఎన్నికలకు ముందు సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. పలు అంశాల్లో వారికి ఊరట కలిగించేలా కీలక నిర్ణయాలు తీసుకుంది. గుర్తింపు, ఉన్నతీకరణతో పాటు పలు అంశాల్లో ముఖ్యంగా యాజమాన్యాలకు ఊరట కలిగించేలా ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుంది. దీంతో చాలా కాలం తర్వాత ప్రైవేటు స్కూళ్లకు గుడ్ న్యూస్ చెప్పినట్లయింది. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయాల ప్రకారం రాష్ట్రంలోని ప్రైవేటు స్కూళ్లకు గతంలో కల్పించిన మూడేళ్ల గుర్తింపును ఎనిమిదేళ్లకు పొడిగించబోతున్నారు. ఇప్పటికే మూడేళ్లకు గుర్తింపు పొందిన స్కూళ్లకు ఎనిమిదేళ్లకు పొడిగిస్తున్నారు. కొత్తగా తీసుకునే వారికి మాత్రం ఎనిమిదేళ్లకు అనుమతులు ఇవ్వనున్నారు. దీంతో మాటిమాటికీ గుర్తింపు కోసం విద్యాశాఖ కార్యాలయాల చుట్టూ యాజమాన్యాలు తిరిగే బాధ తప్పనుంది.అలాగే ప్రైవేటు స్కూళ్లలో అదనపు సెక్షన్ల ఏర్పాటు కోసం కూడా ప్రభుత్వం అనుమతులు ఇవ్వబోతోంది. ఇందుకోసం ఆఫ్ లైన్ లో ప్రతిపాదనలు పంపేలా ప్రైవేటు స్కూళ్లకు అవకాశం కల్పిస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి అంటే 2024-25 నుంచి కొత్త పాఠశాలల ఏర్పాటు, ఉన్నతీకరణ(అప్ గ్రేడేషన్)కు డిసెంబర్ 31 వరకూ ఎలాంటి జరిమానాలు లేకుండా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దీంతోపాటు 2024లో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం అదనపు సెక్షన్లకు అనుమతులు ఇచ్చేందుకు ఆన్ లైన్ లో అవకాశమిస్తున్నారు.

# ముక్కలైన కోట్ల హృదయాలు

241 పరుగుల లక్ష్యాన్ని 43 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఆసీస్ ఛేదించింది. ఈ విజయంతో ఆరోసారి ప్రపంచ ఛాంపియన్‌గా ఆస్ట్రేలియా నిలిచింది. తొలుత బ్యాటింగ్‌లో తేలిపోయిన భారత్ బౌలింగ్‌లోనూ రాణించలేకపోయింది. ఈ టోర్నీలో తొలిసారి భారత బ్యాటర్లు తేలిపోయారు అది కూడా కీలకమైన ఫైనల్‌లో. భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌట్ అయింది. కోహ్లి, రాహుల్ మాత్రమే హాఫ్ సెంచరీలతో రాణించారు. రోహిత్ 47 పరుగులు చేశాడు. మిగతా బ్యాటర్లు చేతులెత్తేయటంతో టీమిండియా 50 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్ మూడు, హేజిల్ వుడ్, కమిన్స్ చెరో రెటండు వికెట్లు పడగొట్టారు. భారత్ నిర్దేశించిన 241 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 4 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. ఆస్ట్రేలియా బ్యాటర్లు ట్రావిస్ హెడ్ 137, లబుషేన్ 58 పరుగులతో రాణించారు. ఓ దశలో 47 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన ఆసీస్‌ను హెడ్, లబుషేన్ ఒడ్డున పడేశారు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 192 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో ఆస్ట్రేలియా మరో ఏడు ఓవర్ల ఆట మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేరుకుంది. ఆరోసారి ప్రపంచకప్‌ను ముద్దాడింది. భారత బౌలర్లలో బుమ్రా రెండు, షమీ, సిరాజ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. గత రెండు పర్యాయాలు సెమీ ఫైనల్‌లో ఓడిన భారత్ ఈసారి ఫైనల్‌లో ఓడి టైటిల్‌కు దూరమైంది.

ప్రజాస్వామ్యంలో ఫ్యాక్షనిస్టులు గెలవకూడదు

రూ.2 వేలు చేశాం. మళ్లీ అధికారంలోకి వస్తే పింఛన్ రూ.5 వేలకు పెంచుతాం. 24 గంటల కరెంట్, రైతుబంధు రూ.16 వేలు అందిస్తాం.' అని వివరించారు.

### కాంగ్రెస్ పై తీవ్ర విమర్శలు

తెలంగాణలో మళ్లీ ఇందిరమ్మ రాజ్యం తెస్తామంటూ కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని, ఇందిరమ్మ రాజ్యమంతా ఆకలి బతుకులేనని సీఎం కేసీఆర్ విమర్శించారు. 'కాంగ్రెస్ పార్టీ ఉన్నన్ని రోజులు ఏమైంది మన బతుకు.? దివంగత సీఎం ఎన్టీఆర్ పార్టీ రూ.2కు కిలో బియ్యం ఇచ్చే వరకూ ఆకలి బతుకులే కదా? ఇందిరమ్మ రాజ్యమంతా ఆకలి బతుకులు. అంత ఎండి సచ్చినం. ఎవ్వడు ఆదుకున్నోడు లేడు. పేదల బాధలు పట్టించుకున్నోడు లేడు. పేదలకడుపు నింపాలన్న శ్రద్ధ ఎవరికీ లేదు. రైతుల పొలాలకు నీరిచ్చే బాధ్యత లేదు. ఏదీ చేయలేదు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలి

గత పదేళ్లలో అనేక సంక్షేమ పథకాలతో తెలంగాణను అభివృద్ధిలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపామని, ఇప్పుడు రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని కేసీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు రైతు బంధు వేస్ట్ అంటూ మాట్లాడుతున్నారని, కరెంట్ కూడా 3 గంటల సరిపోతుందని అంటున్నారని, అది కావాలో? 24 గంటల కరెంట్ కావాలో.? తేల్చుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో అన్ని వర్గాలను ఆదుకుంటున్నామని, దళిత బిడ్డల కోసం దళిత బంధు, కంటి వెలుగు, ఆసరా పింఛన్ ఇలా అన్నింటినీ అందిస్తున్నామని వివరించారు. ఆడబిడ్డలు ప్రసవిస్తే అమ్మఒడి వాహనాల్లో వారిని ఇంటి వద్దే తీసుకెళ్లి దిగబెడుతున్నామని, ఇవన్నీ కొనసాగాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వమే మళ్లీ రావాలని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు.

# కాంగ్రెస్ మేనిఫెస్టోతో బీఆర్ఎస్ భయపడుతోంది

గల్లంతు కాగా, ఈసారి 110 స్థానాల్లో డిపాజిట్లు గల్లంతవుతాయంటూ జోస్యం చెప్పారు. అసలు డిపాజిట్లే రాని పార్టీ బీసీని ఎలా ముఖ్యమంత్రిని చేస్తుందంటూ ఎద్దేవా చేశారు. బీజేపీ 10 రాష్ట్రాల్లో అధికారంలో ఉంటే ఒకరు మాత్రమే ఓబీసీ సీఎంగా ఉన్నారని గుర్తు చేశారు.

### బీజేపీ పట్టించుకోలేదు

బీసీ గణన చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్నా, బీజేపీ పట్టించుకోలేదని, అలాంటి పార్టీ బీసీని ఎలా సీఎం చేస్తుందని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల కోసమే ఎస్సీ వర్గీకరణ హామీ ఇచ్చిందని, ఎన్నికలయ్యాక అసలు ఆ విషయమే బీజేపీ పట్టించుకోదని మండిపడ్డారు. బీజేపీ మాటలను దళితులెవరూ నమ్మరని అన్నారు. అటు, 'ధరణి' పేరుతో కేసీఆర్ కుటుంబం లక్షన్నర ఎకరాలను దోచుకుందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులకు కేవలం 8 నుంచి 10 గంటలు మాత్రమే కరెంట్ ఇస్తున్నారని చెప్పారు. రైతు రుణమాఫీ చేయాలన్న శ్రద్ధ కేసీఆర్ కు లేదని, కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో సీఎం ఆధిపత్య ధోరణితో ముందుకెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### కేసీఆర్‌ను గద్దె దించాలి

పదేళ్లుగా తెలంగాణ ప్రజలు కోరుకున్న స్వేచ్ఛ, సమానత్వం, సమాన అభివృద్ధి అందలేదని, అందుకే మరోసారి ఉద్యమించాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్పష్టం చేశారు. నిరంకుశ నిజాంకు పట్టిన గతే కల్వకుంట్ల కుటుంబానికి తెలంగాణ ప్రజలు రుచి చూపించబోతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలకు ఇదే చివరి ఉద్యమం కావాలని, ప్రజలను బానిసల్లా చూస్తోన్న కేసీఆర్ ను గద్దె దించాలని పిలుపునిచ్చారు. ప్రాజెక్టుల నిర్మాణం విషయంలోనూ నిపుణుల సలహాలు తీసుకోలేదని ధ్వజమెత్తారు. తెలంగాణ ఆత్మ గౌరవం కాపాడడం కోసం రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు.

### ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మేనిఫెస్టో

తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ మేనిఫెస్టో రూపొందించామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. 2 లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేస్తామని, యూపీఎస్సీ తరహాలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, విద్య, వైద్యం, వ్యవసాయం రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేస్తామని, మహిళలకు చేయూత అందిస్తామని వివరించారు. మార్పు రావాలంటే కాంగ్రెస్ కు ఓటేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# బీఆర్ఎస్ అంటే భ్రష్టాచార్ రాక్షసుల సమితి

### బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి మయం

తెలంగాణ ప్రభుత్వం పూర్తి అవినీతిమయంగా మారిందని జేపీ నడ్డా ఆరోపించారు. 'మియాపూర్ లో రూ.4 వేల కోట్ల భూ కుంభకోణం జరిగింది. సర్కారు భూములు అమ్మి భారీ అవినీతికి పాల్పడ్డారు. దళిత బంధు ఇచ్చిన వారికి ఆ మొత్తంలో ఎమ్మెల్యేలు 30 శాతం కమీషన్ తీసుకుంటున్నారు. పీఎం ఆవాస్ యోజన కింద నిధులు విడుదల చేస్తే ఆ మొత్తాన్ని పేదలకు చేరనీయలేదు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ ఫలాలు పేదలకు అందనివ్వడం లేదు.' అని పేర్కొన్నారు. అటు, కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం సైతం హామీల అమలులో విఫలమైందని, ఇచ్చిన ఒక్క గ్యారెంటీని సైతం అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలోనూ కాంగ్రెస్ 6 గ్యారెంటీలను ప్రజలు అస్సలు నమ్మొద్దని హితవు పలికారు. కేంద్రంలో మోదీ చెప్పిన పనులన్నీ చేశారని, ఈ ఎన్నికలు తెలంగాణ భవిష్యత్తును నిర్ధారించే ఎన్నికలని, ప్రజలు ఆలోచించి బీజేపీకి పట్టం కట్టాలని నడ్డా పిలుపునిచ్చారు.

### బీజేపీని గెలిపిస్తే ఉచితంగా గ్యాస్ సిలిండర్లు

ఈ 9 ఏళ్లలో మోదీ ప్రభుత్వం తెలంగాణలో రూ.5 లక్షల కోట్ల నిధులు ఖర్చు చేసిందని జేపీ నడ్డా వివరించారు. రాష్ట్రంలో బీజేపీని గెలిపిస్తే ఉజ్వల్ వినియోగదారులకు ఉచితంగా 4 గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నారు. తెలంగాణ చరిత్రలో తొలిసారి బీసీ వ్యక్తిని సీఎంగా చేస్తామని చెప్పారు. వరికి రూ.3,100 మద్దతు ధర, ఎరువుల కోసం రూ.2,100 ఇన్ పుట్ సబ్సిడీ, మహిళా సంఘాలకు 1 శాతం వడ్డీకే రుణాలు, విద్యార్థినులకు ఉచిత ల్యాప్ టాప్స్ అందిస్తామని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలపై వ్యాట్ తగ్గిస్తామన్నారు. వృద్ధులకు ఉచితంగా అయోధ్య రాముని దర్శనం కల్పిస్తామన్నారు. మోదీ పాలనలో భారత్ ప్రపంచంలోనే ఐదో ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని గుర్తు చేశారు. కుటుంబ పాలనకు స్వస్తి పలికి బీజేపీకి పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# మిస్ యూనివర్స్‌గా నికరాగ్వా అందగత్తె

సమాధానం ఇచ్చారు. 'ఆమె సరిహద్దులను ఉల్లంఘించి చాలా మంది మహిళలకు అవకాశం ఇచ్చింది.. ఈ రోజు మహిళలకు ఎటువంటి పరిమితులు లేవు' అని చెప్పారు. మిస్ యూనివర్స్ కిరీటం దక్కించుకున్న మొట్టమొదటి నికరాగ్వా యువతిగా షేనిస్ రికార్డులకెక్కారు. మొత్తం 84 దేశాలకు చెందిన సుందరీమణులు పాల్గొన్న ఈ పోటీల్లో మొదటి రన్నరప్‌గా మిస్ థాయలాండ్ అన్నోటియా పోర్సిల్డ్, రెండో రన్నరప్‌గా మిస్ ఆస్ట్రేలియా మోరాయ విల్సన్‌లు నిలిచారు. ఇక, భారత్ తరఫున ఈ పోటీల్లో పాల్గొన్న శ్వేతా శార్దా టాప్ 10లో చోటుదక్కించుకోలేకపోయారు. సెమీ-ఫైనల్స్‌లో ఆమె టాప్-20లో నిలిచారు.ఎల్ సాల్వెడార్ వేదికగా జరిగిన ఈ పోటీలు జరిగాయి. 2012 మిస్ యూనివర్స్ ఒలివియా కల్పో, మెనౌనోస్, జెన్నీ మై వరుసగా రెండోసారి టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇచ్చారు. జ్యూరీ హాల్, 2018 మిస్ యూనివర్స్ క్యాథ్రినా గ్రే కరస్పాండెంట్ పాత్రను చేపట్టారు. ఇక, మిస్ యూనివర్స్ పోటీల్లో మొదటిసారి వివాహితతో పాటు పిల్లలున్న మహిళలకు అవకాశం కల్పించారు. 1957లో ఈ పోటీలు ప్రారంభమైన తర్వాత వివాహితలు పాల్గొనడం ఇదే తొలిసారి. పాకిస్థాన్ మొదటిసారిగా ఈ పోటీలకు తమ దేశం తరఫున ప్రతినిధి పంపింది. అలాగే, డెన్మార్, ఈజిప్టు, గునియా, హంగేరి, ఐర్లాండ్, కజికిస్థాన్, లాత్వియా, మంగోలియా, నార్వే, జింబాబ్వే రీ-ఎంట్రీ ఇచ్చాయి. చివరిసారిగా 2001లో జింబాబ్వే, 2006లో లాత్వియా, 2017లో గుయానా, 2019లో ఈజిప్టు, మంగోలియాలు మిస్ యూనివర్స్ పోటీల్లో పాల్గొన్నాయి.

# అమలుకాని మేనిఫెస్టో ప్రకటించిన బిజెపి నాయకులు: రావుల శ్రీధర్ రెడ్డి

**కమిషన్లకు కక్కుర్తి పడే నాయకుడు కాదు మా అభ్యర్థి**

**ఎమ్మెల్యేగా ప్రజలకు సేవచేసినా డిపాజిట్లు దక్కని ప్రభాకర్ బ్రోకర్ మాటలు మానుకో**

**బిజెపి నాయకుల కల్లబొల్లి మాటలు తెలంగాణ ప్రజలు నమ్మరు**

**బిజెపి నాయకుల్ని కాపాడుకోలేని నాయకులు తెలంగాణ ప్రజలకు ఏమి చేస్తారు**



కాప్రా (ప్రశ్న న్యూస్) బీజేపీ మేనిఫెస్టో తెలంగాణ ప్రజల్ని మోసం చేసే విధంగా ఉందని అధికారంలోకి రావడానికి అబద్ధాలు ఆడడంలో బిజెపి పార్టీని మించిన పార్టీ ఇంకోటి లేదని చేతగాని మాటలు చెప్పడంలో బిజెపి నాయకులను మించిన నాయకులు లేరని బీసీ నాయకుడిని ముఖ్యమంత్రి చేస్తానని ప్రకటించిన బిజెపి నాయకులకు ముఖ్యమంత్రి పేరు ప్రకటించే దమ్ము ఉందా అని బిఆర్ఎస్ ఉప్పల్ ఎన్నికల ఇంఛార్జి రావుల శ్రీధర్ రెడ్డి అన్నారు.ఆదివారం రామంతపూర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రకటించిన 25 అంశాల మేనిఫెస్టో తెలంగాణ ప్రజలు నమ్మే విధంగా లేదని అధికారమే లక్ష్యంగా మాటలు చెబుతున్నారే తప్ప తెలంగాణ ప్రజలను అయోమయానికి గురి చేసేలా ఉందని, బీజేపీ ఆచరణలో అమలు కాని హామీలను గుప్పించడం, చేతగాని హామీలను ప్రకటించడం ఏమిటని శ్రీధర్ రెడ్డి ప్రశ్నించారు. ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎన్ వి సిస్ ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వం నుంచి ఎంత బడ్జెట్ తెచ్చి ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాడు తెలపాలని బండారి లక్ష్మారెడ్డిని విమర్శించే స్థాయి ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ కు లేదని అందుకే రెండోసారి ఎమ్మెల్యేగా నిలబడితే ప్రభాకర్కు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు డిపాజిట్లు కూడా దక్కకుండా చేశారని, ఉప్పల్ నియోజకవర్గంలో అభ్యర్థులు లేనట్టుగా డిపాజిట్ కోల్పోయిన బిజెపి అభ్యర్థికి మళ్లీ ఆ పార్టీ టికెట్ ఇచ్చిందంటే బిజెపి పార్టీలో నాయకులు లేరని అర్థమవుతుందని ఉప్పల్లో ప్రభాకర్ తప్ప బిజెపి పార్టీకి నాయకులు లేరా అని ఎమ్మెల్యేగా ఉండి డిపాజిట్ కోల్పోయిన ప్రభాకర్ బండారి లక్ష్మారెడ్డిని విమర్శించడం తన విజ్ఞతకే వదిలేస్తున్నామని ఎమ్మెల్యేగా ఉండి నియోజకవర్గానికి అభివృద్ధి చేయలేదు కానీ మాటలు మాత్రం కోటలు దాటుతాయని, కేంద్ర ప్రభుత్వం నుంచి బడ్జెట్ను తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో ప్రభాకర్ ఎందుకు వెనకాడుతున్నాడని, ఉప్పల్ నియోజకవర్గంలో యువతకు తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎంత మందికి ఉపాధి కల్పించాలని, ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి ప్రశ్నించారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఇప్పటికే ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని, ఉప్పల్ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, ఉప్పల్ ప్రజలు బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తారని, బండారి లక్ష్మారెడ్డి చేసిన సేవలు ఉప్పల్ ప్రజలు కు తెలుసునని, ప్రజలకు సేవ చేయకుండా పొట్టి గాలి మాటలు మాట్లాడుతూ గాలి గాలి చేసే ప్రభాకర్ ప్రజాసేవ గురించి సంక్షేమం గురించి మీరు మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఈ సందర్భంగా అన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం లో చేసింది ఏమీ లేదని బిజెపి అధిష్టానం ఎమ్మెల్యేగా పోటీ చేయమని చెప్పినా కూడా ఎమ్మెల్యేగా పోటీ చేస్తే అంబర్పేట నియోజకవర్గం నుంచి ఓడిపోతానన్న భయంతో తోక ముడిచాడని కేంద్ర మంత్రిగా ఉండి రాష్ట్రానికి ఏమి చేశాడని ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి ప్రశ్నించారు.రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు నయా పైసా ఇవ్వని కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం ప్రస్తుతం ఎన్నికలలో బూటకపు మాటలు మాట్లాడి తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని, మేనిఫెస్టో పేరుతో ప్రజల మోసం చేస్తున్నారని, ఇంతవరకు తెలంగాణ రాష్ట్రంలో యువతకు ఎన్ని ఉద్యోగాలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని, బిజెపి నాయకులను తెలంగాణ ప్రజలు నమ్మే స్థితిలో లేరని బిజెపిలో వెన్నుపోటు రాజకీయాలు నడుస్తున్నాయని, ఎన్నికల్లో బిజెపి పార్టీకి తగిన బుద్ధి తెలంగాణ ప్రజలు చెప్తారని ఈ సందర్భంగా అన్నారు. టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాంట్రాక్టర్ చేసుకొని ప్రజలకు సేవ చేసే నాయకుడే తప్ప ఇండస్ట్రీ ఏరియాలో కమిషన్ల గురించి కక్కుర్తి పడే నాయకుడు కాదని ప్రజలకు సేవ చేయడంలో బండారి లక్ష్మారెడ్డికి సాటి ఎవరూ లేరని బండారి లక్ష్మారెడ్డి ని ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించడం ఖాయమని బ్రోకర్ మాటలను ఎవరు నమ్మరని ఈ సందర్భంగా అన్నారు.ఈ సమావేశంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి,గంధం నాగేశ్వర్ రావు,సర్వ బాబు యాదవ్, శ్రీకాంత్ గౌడ్, బోసాని పవన్ కుమార్, కోంద్రాన్ పల్లి గిరిబాబు,డివిజన్ అధ్యక్షుడు ఎండీ.ముస్తక్, సంధ్యా రాణీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎస్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

## - మంత్రి సబితా ఇంద్రారెడ్డి



కందుకూరు. ప్రతి పక్షాల మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దని మహేశ్వరం బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి సబితా ఇంద్రారెడ్డిఅన్నారు. రంగారెడ్డి జిల్లా మండల పరిధిలోని గుమ్మడవెల్లి తండాకు చెందిన న్యాయవాదులు, రాష్ట్ర బీజేపీ పార్టీ ఎస్టీ మోర్చ లీగల్ సెల్ కన్వీనర్ కిషన్ రాజ్ చౌహన్, ఆయన భార్య ప్రణిత సింగ్ చౌహన్ ఆ పార్టీకి రాజీనామ చేసి మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

అనంతరం వారు మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.మంత్రి సబితా ఇంద్రారెడ్డి విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సబిత మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ రికార్డు సృష్టిస్తారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి ఎవరనేది వారికే స్పష్టత లేదన్నారు. ఆరు నెలలకు ఇక సీఎం మారుతాడని అలాంటి కాంగ్రెస్ పార్టీని ఇంటింటి పంపించాలని కోరారు. ఎస్టీల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నాడని చెప్పారు.

## అంగరంగ వైభవంగా రాధ కూతురి పెండ్లి..
## స్పెషల్ అట్రాక్షన్‌గా అలనాటి హీరోహీరోయిన్లు





తెలుగు, తమిళ ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అక్కర్లేని నటి రాధ (రాధానాయర్). టాలీవుడ్ స్టార్ హీరోలతో కలిసి నటించి.. వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. ఈ సీనియర్ నటి పెద్ద కూతురు, రంగం ఫేం కార్తీక నాయర్ వెడ్డింగ్ సెర్మనీ గ్రాండ్‌గా జరిగింది. తిరువనంతపురంలోని ఉదయ్ సముద్ర లీజర్ బీచ్ హెూటల్‌లో నిర్వహించిన కార్తీక నాయర్-రోహిత్ మీనన్ వెడ్డింగ్ ఈవెంట్‌కు కుటుంసభ్యులు, సన్నిహితులు, ఇండస్ట్రీ ప్రముఖులు హాజరయ్యారు.టాలీవుడ్ నుంచి మెగాస్టార్ చిరంజీవి ఈవెంట్‌కు హాజరై వధూవరులను ఆశీర్వదించాడు. వెడ్డింగ్ సెర్మనీలోభాగ్యరాజ్, సుహాసిని, రేవతి, రాధికా శరత్‌కుమార్, అంతా కలిసి దిగిన ఫొటోతోపాటు చిరు, రాధిక సెల్ఫీ ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి. వెడ్డింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, ఫొటోలు బయటకు రావాల్సి ఉంది. నాగచైతన్య నటించిన జోష్ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది కార్తీక నాయర్. ఆ తర్వాత రంగం సినిమాతో మంచి తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకుంది.

ఎన్టీఆర్‌తో కలిసి దమ్ము సినిమాలో మెరిసిన ఈ భామ చివరగా 2014లో బ్రదర్ బొమ్మాళి సినిమాలో నటించింది. 2015 తర్వాత సిల్వర్ స్క్రీన్‌పై దూరమైపోయింది.

## ప్రభాస్ సలార్‌ను నార్త్ఇండియాలో
## రిలీజ్ చేస్తుందెవరో తెలుసా..?




గ్లోబల్ స్టార్ హీరో ప్రభాస్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రాల్లో ఒకటి సలార్ కేజీఎఫ్ ఫేం ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్నాడు. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో సలార్ రెండు పార్టులుగా వస్తోంది. డిసెంబర్ 22న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషనల్ ఈవెంట్‌ను రెడీ చేసుకుంటుంది ప్రభాస్ టీం. సలార్‌ను కేరళలో మాలీవుడ్ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ హెూం బ్యానర్ పృథ్వీరాజ్ ప్రొడక్షన్స్ హౌజ్ విడుదల చేయనుండగా.. నైజాంలో టాలీవుడ్ పాపులర్ ప్రొడక్షన్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ సలార్‌ను విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే అప్‌డేట్స్ అందించారు మేకర్స్. అనిల్ తడని నార్త్ఇండియాలో ఈ సినిమాను విడుదల చేయనుంది. ఈ బ్యానర్ గతంలో బాహుబలి సిరీస్, కేజీఎఫ్ సిరీస్, సైరా నరసింహారెడ్డి, 2.0 (హిందీ)లో విడుదల చేసింది. ఈ సినిమాలన్నీ దాదాపు మంచి హిట్స్‌గా నిలిచాయి. మరోసారి సలార్‌ను విడుదల చేస్తుండటంతో అంచనాలు పెరిగిపోతున్నాయి. ఓవర్సీస్‌లో సలార్‌ను విడుదల చేస్తుంది.సలార్ ట్రైలర్ డిసెంబర్ 1న రాత్రి 7:19 గంటలకు లాంఛ్ చేయనున్నారు మేకర్స్. సలార్‌లో శృతిహాసన్ హీరోయిన్‌గా నటిస్తోంది. సలార్‌లో పృథ్వీరాజ్ సుకుమారన్ వరదరాజ మన్నార్ ది కింగ్ పాత్రలో నటిస్తుండగా.. వరదరాజ మన్నార్ ది కింగ్ లుక్ ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తోంది.సలార్ నుంచి ఇప్పటికే లాంఛ్ చేసిన టీజర్‌లో గూస్‌బంప్స్ తెప్పించే విజువల్స్ సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి.సలార్ టీజర్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది.


హెూంబలే ఫిలిమ్స్ బ్యానర్‌పై విజయ్ కిరగందూర్ తెరకెక్కిస్తున్న సలార్ తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

## 'లియో' నుంచి 'నా రెడీ సాంగ్'
## ఫుల్ వీడియో వచ్చేసింది




కోలీవుడ్ స్టార్ హీరో విజయ్, త్రిష జంటగా నటించిన చిత్రం 'లియో' అక్టోబర్ 19న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.550 కోట్లకు పైగా వసూళ్లు సాధించి బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఇక ఈ సినిమాలో గౌతమ్ మీనన్, అర్జున్, సంజయ్ దత్, మన్సూర్ ఆలీ ఖాన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఇదిలా ఉంటే విజయ్ అభిమానులకు ఒక సర్‌ప్రైజ్ న్యూస్ వచ్చింది. ఈ మూవీ నుంచి వచ్చిన ఫస్ట్ సింగిల్ 'నా రెడీ సాంగ్' ఎంత పెద్ద హిట్టయిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తాజాగా ఈ పాటకు సంబంధించి మేకర్స్ ఫుల్ వీడియోను విడుదల చేశారు. విష్ణు ఎడవన్ రాసిన ఈ ట్రాక్‌ను తమిళంలో దళపతి విజయ్, అనిరుధ్ రవిచందర్ కలిసి పాడగా.. తెలుగులో ఈ పాటను రేవంత్ చేత పాడించారు. రఘురామ్ సాహిత్యం అందించాడు.

## షాకింగ్ రన్ టైమ్‌తో 'యానిమల్'..
## సందీప్ ఏం ప్లాన్ చేస్తున్నాడు..?




అర్జున్ రెడ్డి ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'యానిమల్'. రణబీర్ కపూర్ రష్మిక మంధాన హీరో హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి టీజర్‌తో పాటు పాటలు విడుదల కాగా ప్రేక్షకులను ఓ రేంజ్‌లో ఊపేస్తున్నాయి. ఇక ఈ సినిమా డిసెంబర్ 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది.తాజాగా ఈ సినిమాకు సంబంధించిన రన్ టైమ్ సోషల్ మీడియాను ఊపేస్తుంది. ఈ సినిమా రన్‌టైమ్ అక్షరాల 3 గంటల 21 నిమిషాలట. అదే నిజమైతే ఇటీవల కాలంలో విడుదలైన చిత్రాల్లో అత్యధిక నిడివి ఉన్న బాలీవుడ్ చిత్రం ఇదే కానుంది. 2016లో వచ్చిన 'ధోనీ' సినిమా (రన్‌టైన్ 3.10) తర్వాత 3 గంటలకు పైగా రన్ టైమ్ హిందీ చిత్రం ఇదే కావడం విశేషం. నిజానికి ఇంత లెంగ్తీ రన్‌టైమ్‌తో ఆడియెన్స్‌ను థియేటర్‌లకు కట్టిపడేయం కత్తి మీద సామే. అయితే బాలీవుడ్ వర్గాల సమాచారం ప్రకారం.. సినిమా టెర్రిఫిక్‌గా ఉందని, ఒక్క నిమిషం కూడా బోర్ కొట్టుకుండా ఉంటుందని వినిపిస్తుంది. ఇంత లెంగ్తీ రన్‌టైమ్ అంటే మల్టిప్లెక్స్ థియేటర్‌లకు చుక్కేదురే అని చెప్పాలి. ఎప్పటికంటే కాస్త త్వరగానే ఆటలు మొదలు పెట్టాల్సి ఉంటుంది. అంతేకాకుండా పెద్ద సినిమాలకు ఆరు షోల వరకు చాన్స్ ఉంటే.. యానిమల్ సినిమాకు మాత్రం ఐదు షోలు మాత్రమే వేసుకునే చాన్స్ ఉంటుంది. ఇక సింగిల్ స్క్రీన్ థియేటర్‌లలో కూడా టైమింగ్స్ మారే చాన్స్ ఉంటుంది. అయితే ఇందులో నిజమెంతుందో తెలియాంటే మాత్రం ఇంకొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

# మిర్చియార్డ్ హంగామా

సంక్రాంతిని టార్గెట్ చేసుకుని శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్నది మహేశ్, త్రివిక్రమ్‌ల 'గుంటూరుకారం' సినిమా. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో ప్రత్యేకంగా వేసిన గుంటూరు మిర్చియార్డ్ సెట్‌లో జరుగుతున్నది. ఈ సెట్‌లో శేఖర్ మాస్టర్ నృత్య దర్శకత్వంలో ఓ మాస్ గీతాన్ని దర్శకుడు త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్నారు. మహేశ్‌బాబుతోపాటు ఇతర తారాగణం కూడా ఈ పాటలో పాల్గొంటున్నది. 'గుంటూరుకారం' మహేశ్ కంటే త్రివిక్రమ్‌కి చాలా ఇంపార్టెంట్ మూవీ. ఎందుకంటే ఈ సినిమా తర్వాత మహేశ్ ఎలాగూ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తారు. రెండు భాగాలుగా తెరకెక్కనున్న ఆ సినిమాతో మహేశ్ పాన్ వరల్డ్ హీరోగా రూపాంతరం చెందడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు. ఇక త్రివిక్రమ్ 'గుంటూరుకారం' తర్వాత అల్లు అర్జున్‌తో సినిమా చేయబోతు న్నారు. తను ఇప్పటికే 'పుష్ప'తో పాన్ ఇండియా హీరోగా అవతరించాడు. అల్లు అర్జున్ చిత్రం అంటే పాన్ ఇండియా స్థాయిలో విడుదల అవ్వడం కామన్. మరి అలాంటప్పుడు త్రివిక్రమ్ మేకింగ్‌లో యూనివర్సల్ అప్పీల్ అవసరం. దానికి 'గుంటూరుకారం' చిత్రమే నాందిగా నిలవాలి. అందుకే పట్టుదలతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు త్రివిక్రమ్. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల, మీనాక్షి చౌదరి కథానాయికలుగా నటిస్తున్న విషయం తెలిసిందే.



## బాలీవుడ్‌కు గుడ్‌బై

హిందీ చిత్రసీమలో ఒకప్పుడు అగ్ర కథానాయికగా రాణించింది ప్రియాంక చోప్రా. నిక్ జోనస్‌తో వివాహానంతరం లాస్‌ఏంజిల్స్‌కు మకాం మార్చి హాలీవుడ్‌లో కూడా గుర్తింపును సంపాదించుకుంది. అభిమానులు ఈ భామను గ్లోబల్ స్టార్ అంటూ అభివర్ణిస్తారు. గత కొంతకాలంగా హాలీవుడ్ సినిమాలు, వెబ్‌సిరీస్‌లకే ప్రాధాన్యతనిస్తున్నది ప్రియాంక చోప్రా. భవిష్యత్తులో ఈ అమ్మడు హిందీ పరిశ్రమకు గుడ్‌బై చెప్పనుందని ముంబయి సినీ వర్గాల్లో వినిపిస్తున్నది. ఈ వార్తలకు బలం చేకూర్చేలా ముంబయిలోని తన ఆస్తులను వరుసగా అమ్మకానికి పెడుతున్నది ప్రియాంక. తాను ఎంతో ఇష్టపడి డిజైన్ చేసుకున్న ఆంధేరిలోని ఖరీదైన ఫ్లాట్‌ను కూడా ఇటీవలే పదికోట్లకు విక్రయించింది. అలాగే ఓ కమర్షియల్ ప్రాపర్టీని కూడా అమ్మేసిందట. ఈ నేపథ్యంలో ప్రియాంక చోప్రా హిందీ చిత్రసీమకు దూరం కాబోతున్నదనే ప్రచారం జరుగుతున్నది. హాలీవుడ్‌లో వరుసగా భారీ ఆఫర్స్ రావడం.. హిందీ ఇండస్ట్రీలో అంతగా అవకాశాలు లేకపోవడంతో లాస్‌ఏంజిల్స్ కేంద్రంగానే కెరీర్‌ను కొనసాగించాలనే నిర్ణయానికి వచ్చిందని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రియాంక చోప్రా 'హెడ్స్ ఆఫ్ స్టేట్' అనే హాలీవుడ్ చిత్రంలో నటిస్తున్నది.



## త్రిషపై సంచలన వ్యాఖ్యలు చేసిన
## తమిళ నటుడు..

**- ఘాటుగా స్పందించిన త్రిష**



కోలీవుడ్ స్టార్ హీరో విజయ్, త్రిష జంటగా నటించిన చిత్రం 'లియో' అక్టోబర్ 19న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.550 కోట్లకు పైగా వసూళ్లు సాధించి బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. అయితే ఈ సినిమాలో గౌతమ్ మీనన్, అర్జున్, సంజయ్ దత్, మన్సూర్ ఆలీ ఖాన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ సినిమాపై ఒక ఇంటర్వ్యూలో నటుడు మన్సూర్ అలీ ఖాన్ మాట్లాడుతూ.. త్రిషపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇంతకీ ఏం జరిగింది అంటే.. రీసెంట్‌గా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మన్సూర్ అలీ ఖాన్ 'లియో' మూవీపై మాట్లాడుతూ.. లియో చిత్రంలో త్రిష నటిస్తున్నారని నాకు తెలిసింది. నేను కూడా ఈ సినిమాలో నటిస్తున్న అయితే త్రిషతో నేను చేసే సన్నివేశాలలో ఒక్క సన్నివేశం అయినా బెడ్‌రూమ్ సీన్ ఉంటుందని అనుకున్నా. నా మునుపటి సినిమాల లాగానే ఈ సినిమాలో కూడా త్రిషను బెడ్రూమ్ కి తీసుకెళ్లవచ్చని అనుకున్నాను. కానీ అలా జరగలేదు. నేను ఇంతకుముందు చాలా సినిమాల్లో చాలా రేప్ సీన్లు చేశాను. రేప్ సీన్లు నాకు కొత్త కాదు. కానీ కశ్మీర్‌లో షూటింగ్ జరుగుతున్నప్పుడు సెట్స్‌లో త్రిషను కనీసం నాకు చూపించలేదు. అంటూ మన్సూర్ కామెంట్స్ చేశారు. దీంతో ఈ వార్తలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. దీంతో మన్సూర్ అలీ ఖాన్ వ్యాఖ్యలపై పలువురు సినీతారలు మండిపడుతున్నారు. సింగర్ చిన్మయి శ్రీపాద, మలయాళ నటి మాళవిక మోహన్, దర్శకుడు లోకేష్ కానగరాజ్, ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మల్కాజిగిరి అభ్యర్థి తలరాతను మార్చే సిఫిల్ కాలనీ ఓటర్లు

**- అభివృద్ధి చేశాను అంటున్నా మైనంపల్లిగా మద్దతు - అభివృద్ధి చేస్తాను అంటున్న మర్రికా మద్దతు**

**- ఐదు సంవత్సరాల మైనంపల్లి పాలనలో అభివృద్ధి అంతా జరగలేదా..**

**- కాలనీ అధ్యక్షులపై దాడి చేపించిన మైనంపల్లికి ఇప్పుడు మద్దతు దొరికేనా.?**




మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్) మల్కాజిగిరి అసెంబ్లీ అభ్యర్థుల తలరాతను మార్చే స్థాయికి కొన్ని కాలనీలో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. మల్కాజిగిరి నియోజకవర్గం లో ఇప్పుడు అందరి చూపు సిఫిల్ కాలనీ వైపు ఉంది. కాలనీ అధ్యక్షుడు సుభాష్ ఏ పార్టీకి మద్దతు తెలిపితే ఆ పార్టీ అభ్యర్థి గెలవడం తథ్యం. మల్కాజిగిరి నియోజకవర్గంలో ఉన్న కాలనీల అధ్యక్షులు సభ్యులు ఆటను మార్చరున్నారు ఈ కాలనీల ఓటర్లు. వ్యక్తిగత కారణాలతో బీఆర్ఎస్ కు రాజీనామ చేసి కాంగ్రెస్ లో చేరిన ప్రస్తుత ఎమ్మెల్యే మైనంపల్లి ఒక వైపు, గత్యంతరంలేక వేరే నియోజకవర్గం నుండి ఇంచార్జి హోదాలో ఉన్న వ్యక్తిని మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మర్రి రాజశేఖర్ రెడ్డి ని ప్రకటించిన వైనం మరో వైపు. ఇది ఇలా ఉంటే, ఎవరు లేకపోతే, అక్క మొగుడే దిక్కు అన్నట్లు ఎమ్మెల్యే అయిన ఎమ్మెల్సీ అయిన ఎంపీ అయిన గెలిచినా, ఓడినా ఆయనే పెద్ద దిక్కు అంటూ మళ్ళీ ఆయననే అభ్యర్థి గా బిజెపి పార్టీ రామచంద్రరావును ప్రకటించిన వైనం. మల్కాజిగిరి ఓటర్లు అభ్యర్థి ని చూసి ఓటు వేయాలా.? లేక పార్టీ ని చూసి ఓటు వేయాలా.? లేక నిరంతరం తమతో ఉంటూ, కాలనీ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుంటున్న కాలనీ ప్రతినిధుల సలహాపై ఓటు చేయాలా.? అనే సందేహం లో కాలనీల ప్రజలు ఉన్నారనేది వాస్తవం. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే మల్కాజిగిరి లో కాలనీ ప్రతినిధి అనగానే అందరికి వెంటనే గుర్తుకు వచ్చే ఏకైక వ్యక్తి " సిఫీల్ కాలనీ ప్రతినిధి అధ్యక్షుడు సుభాష్. " ఎల్లప్పుడూ అందరికి అందుబాటులో ఉంటూ, తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్య ను పరిష్కరించడానికి కృషి చేస్తూ, చుట్టుపక్క కాలనీలకు సలహాలు సూచనలు ఇవ్వడమే కాకుండా వాళ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ఆయనకు అలాగవాటుగా మారింది దానితో అందరి మన్నలను పొందుతు, ఒక కార్పొరేటర్ స్థాయికి మించి కృషి చేస్తున్నారనే ప్రశంసలే కాకుండా ఒకానొక సందర్భంలో కాలనీలా సమస్యలపై ఆమరణ నిరాహారదీక్షకు కూడా వెనుకాడని సుభాష్ వైపే అందరి చూపు ఉన్నట్టుగా తెలుస్తున్నది. మల్కాజ్గిరి నియోజకవర్గ పరిధిలో ఆయన ఏ అభ్యర్థికి మద్దతు ప్రకటిస్తారనే విషయం చర్చనీయంశంగా మారింది. అయితే సుభాష్ మాత్రం మూడు ప్రధాన పార్టీ లతోను సమ దూరం పాటిస్తున్నారు.

అధికార బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మర్రి రాజశేఖర రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మైనంపల్లి హనుమంత రావు సిఫీల్ కాలనీని పర్యటించినపుడు కాలనీ ప్రజలతో జరిపిన సమావేశములలో కాలనీ అభివృద్ధి కి వీరిద్దరినుండి నిబద్దత తీసుకొన్నారు. చివరి నిమిషంలో అభ్యర్థిగా ప్రకటించడం వలన బిజెపి అభ్యర్థి రామచంద్రరావు కు సిఫీల్ కాలనీప్రజలతో సమావేశం జరగవలసి ఉన్నది. సిఫీల్ కాలనీ, చుట్టుపక్కల పరిసర ప్రాంతాల కాలనీలా వాసులు సుభాష్ ఏ అభ్యర్థి వైపు మొగ్గు చూపుతున్నారనే ఉత్కంటతో ఎదురు చూస్తున్నారు.

# సనత్ నగర్‌లో వేగంగా పుంజుకుంటున్న కోట నీలిమ

- రోజు రోజుకు పెరుగుతున్న ప్రజాదరణ
- అన్ని డివిజన్లు చుట్టేస్తున్న మహిళ నాయకురాలు
- ఈసారి తలసానికి గెలుపు కష్టమే అంటున్న ఓటర్లు





**బేగంపేట (ప్రశ్న న్యూస్)** గ్రేటర్ హైదరాబాద్ రాజకీయాల్లో గత 10 ఏళ్లుగా మంత్రిగా చక్రం తిప్పిన సనత్ నగర్ బీఆర్'ఎస్ అభ్యర్థి తలసని శ్రీనివాస్ యాదవ్ కు ఈసారి గెలుపు అంత సునాయాసం కాదని ఓటమి తప్పదని నియోజకవర్గ ఓటర్లు అంటున్నారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పరిపాలన అధ్వానంగా ఉందని నియోజకవర్గంలో అనేక సమస్యలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్న వాటిని తీర్చడం లో తలసాని పూర్తిగా విఫలం చెందారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పది సంవత్సరాల లో తలసాని సొంత అభివృద్ధిలో కనీసం ఐదు శాతం అయినా నియోజకవర్గన్ని అభివృద్ధి చేసి ఉంటే ప్రజలు ఈరోజు ఇన్ని కష్టాలు అనుభవించేవారు కాదని సనత్ నగర్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కోట నీలిమ అన్నారు. రామ్ గోపాల్ పేట డివిజన్ లో పర్యటించిన నీలిమ, గులాబీ పార్టీ విధానాలను తీవ్రంగా తప్పుబట్టారు. యువతకు ఉద్యోగాల భర్తీ, ఉపాధి కల్పనలో ఆశ పెట్టిన బీఆర్ఎస్ సర్కార్, వాటి అమలులో ఘోరంగా విఫలమైందన్నారు. ఈ మేరకు నిరుద్యోగులను మోసం చేసిందని కోట నీలిమ మండిపడ్డారు. చదువుకున్న యువత కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీని తలసాని శ్రీనివాస్ యాదవ్ ని ఓడిస్తారని యువత జీవితాలతో చెలగాటం ఆడుకున్న ఏ ప్రభుత్వం బాగుపడ్డ దాఖలాలు చరిత్రలో లేవన్నారు.ఎన్నికల మేనిఫెస్టోలో జాబ్ క్యాలెండర్?ను ప్రకటించిన ఘనత ఒక్క కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. సనత్ నగర్ డివిజన్?లోని ఎస్ఆర్టీ కాలనీలో ఆమె ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఇదే సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామని చెప్పుకొచ్చారు.

నియోజకవర్గంలో ప్రజల సమస్యలు తీరుస్తానని నాలాల పరివాహక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

# బీజేపీ అధికారంలోకి వస్తే సింగరేణి కార్మికులకు ఐటీ రద్దు

**- కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇస్తామని హామీ**

**- కేసీఆర్ ఉద్యోగాలు ఇవ్వలేదు... నిరుద్యోగ భృతినీ ఇవ్వలేదన్న ఈటల**

**- సింగరేణిలో నేటికీ ఎన్నికలు జరిపించలేదని ఈటల విమర్శలు**



**మంచిర్యాల (ప్రశ్నన్యూస్):** బీజేపీ అధికారంలోకి వస్తే సింగరేణి కార్మికులకు ఐటీని రద్దు చేస్తామని బీజేపీ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మూడో స్థానమే వస్తుందని జోస్యం చెప్పారు. ఆయన మంచిర్యాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇస్తామని హామీ ఇచ్చారు. సింగరేణిలో కార్మికుల సంఖ్య ఇదివరకు 63 వేలు ఉండగా ఇప్పుడు 39 వేలకు పడిపోయిందన్నారు. ఇక్కడ సింగరేణిలో నిరుద్యోగులకు రావాల్సిన ప్రభుత్వ ఉద్యోగాలను పోగొట్టిన దుర్మార్గుడు కసీఎం కేసీఆర్ అని ధ్వజమెత్తారు. తాడిచెర్ల ఓపెన్ కాస్టును ప్రయివేటుపరం చేశాడని కేసీఆర్‌పై విమర్శలు గుప్పించారు. తెలంగాణలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని కూడా నెరవేర్చుకోలేదన్నారు. సింగరేణి ఇప్పుడు చచ్చుపడిపోయిందన్నారు. సింగరేణి కార్మికుల హక్కులను కాలరాశారని, అందుకే నేటికీ సింగరేణిలో ఎన్నికలు జరిపించలేదని ఆరోపించారు. ప్రధాని మోదీ ఛాయ్ అమ్మాడని, ఆయన తల్లి ఇళ్లలో పని చేసేదని, అలాంటి స్థాయి నుంచి ప్రధానిగా ఎదిగారన్నారు. మోదీ కష్టాన్ని, ధైర్యాన్ని నమ్ముకోవడం వల్లే ఆ స్థాయికి చేరుకున్నారన్నారు.

## హనుమంతుడి గుడి లేని ఊరు లేదు... కేసీఆర్ పథకం అందని ఇల్లు లేదు: ఎమ్మెల్సీ కవిత



**జగిత్యాల (ప్రశ్నన్యూస్):** ఎన్నికల నేపథ్యంలో ఇతర పార్టీల వారు వచ్చి ఇది చేస్తాం... అది చేస్తామంటూ మాటలు చెప్పి వెళతారని, అలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణ ప్రజలతో బీఆర్ఎస్‌ది పేగు బంధమని, కాంగ్రెస్‌ది అధికారం కోసం అహంకారమన్నారు. కాంగ్రెస్‌కు పెట్టే గుణం లేదని, అధికారకాంక్ష మాత్రమే ఉందన్నారు. పచ్చబడ్డ తెలంగాణ ఆగం కావొద్దంటే ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. కాంగ్రెస్‌కు ఆరు దశాబ్దాలు అవకాశం ఇస్తే ఏం చేశారని నిలదీశారు. అధికారం శాశ్వతం కాదని, అనుబంధం శాశ్వతంగా ఉంటుందన్నారు. తెలంగాణ కోసం బీఆర్ఎస్ తీవ్రంగా ఉద్యమించిందని, రాష్ట్రం కోసం కొట్లాడిన పార్టీ అని, అందుకే ప్రజలతో బీఆర్ఎస్‌కు పేగుబంధం ఉందన్నారు. గత పదేళ్ల కాలంలో కేసీఆర్ పాలనలో తెలంగాణ పచ్చబడిందన్నారు. కేసీఆర్ చెప్పింది చేసే వ్యక్తి అన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని పనులు కూడా చేశారన్నారు. రాష్ట్రంలో హనుమంతుడి గుడి లేని ఊరు లేదని, అలాగే కేసీఆర్ పథకం అందని ఇల్లు లేదన్నారు. రాష్ట్రంలో మరోసారి కేసీఆర్ ప్రభుత్వం వస్తే పెన్షన్ రూ.5 వేలకు పెరుగుతుందన్నారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే రూ.3 వేలకు పెరుగుతుందన్నారు. ఆ తర్వాత ప్రతి సంవత్సరం పెరుగుతూ అయిదేళ్లలో రూ.5 వేలకు చేరుతుందన్నారు. కటాఫ్ డేట్‌తో సంబంధం లేకుండా బీడీ కార్మికులందరికీ పెన్షన్లు ఇవ్వాలని కేసీఆర్ సంకల్పించా రన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకం కింద పేద మహిళలకు రూ.3 వేల పెన్షన్ ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈసారి గెలవగానే కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు. అప్పుడు కోటి కార్డులు అవుతాయన్నారు. కేసీఆర్ మేనిఫెస్టో అంటే... డబ్బులు ఇచ్చే వాటిని పెంచుడు... సిలిండర్ ధర తగ్గించుడు అన్నారు. ఔర్ ఏక్ బార్ కేసీఆర్ సర్కార్ అని నినదించారు.

## కరీంనగర్‌లో గంగులను చిత్తుగా ఓడిస్తా



**కరీంనగర్ (ప్రశ్నన్యూస్)** తనపై విమర్శలు గుప్పించిన మంత్రి గంగుల కమలాకర్‌కు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సవాల్ విసిరారు. తన ఆస్తులకు సంబంధించిన పత్రాలతో మంత్రి గంగుల వస్తే, తన పేరిట ఉన్న ఆస్తులన్నింటినీ తాను కరీంనగర్ ప్రజలకు పంచుతానన్నారు. మరి తనలాగే నేను పత్రాలు తీసుకువస్తే తన ఆస్తులను ప్రజలకు పంచే ధైర్యం ఉందా? అన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రిగా ఉండి ఇప్పటి వరకు నియోజకవర్గంలో రేషన్ కార్డులు ఇవ్వని వ్యక్తి... మళ్లీ గెలిపిస్తే రేషన్ కార్డులు ఇస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాను ప్రజల తరఫున పోరాటం చేశానని, అందుకే తనపై 74 కేసులు ఉన్నాయన్నారు. కుటుంబాన్ని పక్కన పెట్టి మరీ ప్రజల కోసం కొట్లాడుతున్నానన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గంగులను చిత్తుగా ఓడిస్తానన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588